RNI
TEL TEL / 2023/ 84132

# అక్షర సవాల్

సామాన్యుడు ప్రశ్నించే గొంతుక

ప్రచురణ-వరంగల్ రంగారెడ్డి | ఎడిటర్: బాదావత్ బాలాజి | సంపుటి :04 | సంచిక :21 శుక్రవారం 17 ఏప్రిల్ 2026 | పేజీలు -8 | వెల రూ 5-00

## రేవంత్ ట్రాప్‌లో సౌత్ ప్రజలు పడరు

: రాంచందర్ రావు

**హైదరాబాద్, ఏప్రిల్ 16:** కాంగ్రెస్ మరోసారి దేశ విభజనకు కుట్రలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు( ఆరోపించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. సౌత్, నార్త్ అంటూ కాంగ్రెస్ పెద్ద కుట్ర చేస్తోందన్నారు. గతంలో మహిళా బిల్లు అమలు చేయాలన్న రాహుల్‌గాంధీ.. ఇప్పుడెందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. నార్త్‌లో కాంగ్రెస్ పోయిందని.. త్వరలో సౌత్‌లో కూడా పోతుందంటూ వ్యాఖ్యానించారు. రేవంత్ ట్రాప్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రజలు పడరని.. సౌత్ ప్రజలు తెలివైన వారన్నారు. రేవంత్ రెడ్డి నార్త్ సౌత్ డివిజన్ రాజకీయాలు చేస్తున్నారంటూ టీబీజేపీ చీఫ్ మండిపడ్డారు. రీజినల్ పార్టీలు మాట్లాడుతున్నాయంటే ఏదో అనుకోవచ్చు.. కానీ కాంగ్రెస్ లాంటి జాతీయ పార్టీ ఇలాంటి మాటలు మాట్లాడటం సరికాదని తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు పేర్కొన్నారు.

రిపోర్టర్లు కావలెను
ఈ క్రింది పోస్టులకు అనుభవజ్ఞులు కావలెను
సబ్ ఎడిటర్లు - 02
బ్యూరో చీఫ్ (ఉమ్మడి వరంగల్ జిల్లా) - 01
స్టాఫ్ రిపోర్టర్లు - 06 (జనగాం, మానుకోట, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ)
అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ - 01
యాడ్ ఆఫీసర్స్ - 02
సర్క్యులేషన్ ఆఫీసర్ - 01
అనుభవాన్ని బట్టి వేతనం ఇవ్వబడును.
ఇంకెందుకు ఆలస్యం...
9347332442, 8096677136 నంబర్‌కు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

## కాంగ్రెస్ తో కలిసి
# రేవంత్ పనిచేస్తారా

**హైదరాబాద్, ఏప్రిల్ 16:**కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య మార్పులకు దారితీస్తోంది. జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్యను పెంచితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందనే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరిదీ ఒకే విధానంగా కనిపిస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడంపై కేటీఆర్ విరుచుకుపడుతుండగా, అటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దక్షిణాది హక్కుల కోసం గళం ఎత్తుతోంది.జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన తెలంగాణ వంటి రాష్ట్రాలను సీట్ల పెంపు విషయంలో శిక్షించడం అన్యాయమని కేటీఆర్ అంటున్నారు. ప్రస్తుత పార్లమెంటులో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా ఏ మాత్రం తగ్గకూడదని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఇదే అంశంపై రేవంత్ రెడ్డి కూడా గతంలో ప్రధాని మోదీకి లేఖ రాస్తూ.. దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేలా విభజన ఉండకూడదని స్పష్టం చేశారు. విధానపరంగా ఇద్దరు నేతలు ఒకే తాటిపై ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని రాజకీయ సమీకరణాల దృష్ట్యా వీరు కలిసి పోరాడే అవకాశం మాత్రం శూన్యంగా కనిపిస్తోంది.బిజెపి ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శఇస్తున్నారు. ప్రత్యేక పార్లమెంటు సమావేశాల ఎజెండాపై నమ్మకం లేదని మండిపడ్డారు. 50 శాతం సీట్ల



పెంపుపై ఎక్కడా అధికారిక ప్రకటన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైతం తెలంగాణకు న్యాయం చేస్తారన్న -- మిగతా5లో

# పెట్టుబడులు పెట్టండి..

**అమెరికా పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం**



**హైదరాబాద్, ఏప్రిల్ 16:** అమెరికా 'నేషనల్ వార్ కాలేజ్' బృందంతో మంత్రి శ్రీధర్ బాబు ఈరోజు(గురువారం) సమావేశమయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని అమెరికా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. డ్రోన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో స్కిల్డ్ వర్క్ ఫోర్స్ సిద్ధంగా ఉందని.. TG-iPASS ద్వారా 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. టెక్నాలజీ, రీసెర్చ్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏరోస్పేస్ రంగం ఏటా సగటున 30 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. ఎగుమతుల్లో 103 శాతం సీఏజీఆర్‌తో తెలంగాణ దూసుకుపోతోంది. రాకెట్ల నుంచి శాటిలైట్ల వరకు అన్ని ఉత్పత్తులపై 'మేడ్ ఇన్ తెలంగాణ' ముద్ర పడుతోంది. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1500కి పైగా ఎంఎస్ఎంఈలతో తెలంగాణ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోంది. 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ టాప్ స్థానంలో నిలిచింది. వరుసగా ఐదు సార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం తెలంగాణ సాధించిన మరో విజయం.

## తెలంగాణ కుల సర్వే అధికారిక
# నివేదిక విడుదల

**తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే... నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం**

**తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం**


**రాష్టంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం అని వెల్లడి**

**జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో**

**ఓసీల్లో రెడ్డి, ఎస్టీల్లో లంబాడీల జనాభా అత్యధికం**

**దాదాపు 4 శాతం మంది ప్రజలు తమకు కులం లేదని వెల్లడించిన వైనం**

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది.




ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

**సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా**

సర్వే ఫలితాల ప్రకారం, - మిగతా5లో

## త్వరలో సంస్థాగత
# పోస్టులు..



**హైదరాబాద్, ఏప్రిల్ 16:**తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో గత కొద్దిరోజులుగా నెలకొన్న అంతర్గత పరిణామాలు, పాలనాపరమైన నిర్ణయాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసంలో అత్యంత కీలకమైన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ , టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఈ భేటీలో పాల్గొన్నారు. దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయం, నామినేటెడ్ పదవుల భర్తీపై ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఈ భేటీలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అంశం నామినేటెడ్ పదవుల భర్తీ . గత కొంతకాలంగా పార్టీ కోసం కష్టపడిన సీనియర్ నాయకులు, ద్వితీయ శ్రేణి కార్యకర్తలు పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. మరో రెండు రోజుల్లోనే పెండింగ్‌లో ఉన్న కీలకమైన నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం దెబ్బతినకుండా జాబితాను సిద్ధం చేయాలని సీఎం పార్టీ నేతలకు సూచించారు. ఇది కార్యకర్తలలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని అధిష్టానం భావిస్తోంది.పార్టీలో -- మిగతా5లో

## పార్లమెంట్ సాక్షిగా తెలంగాణకు
# అవమానం జరిగింది

: మంత్రి పొన్నం

**ఇంటర్నెట్ డెస్క్:** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లుపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. తేజస్వి వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా ఉన్నాయని, వాటిని లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. అలాగే తేజస్వి లోక్‌సభ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాలని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. 'తెలంగాణ డీఎన్ఏ ఉన్న ఎవరైనా తేజస్వి వ్యాఖ్యలను ఖండించాలి. ఈ విషయమై తెలంగాణ బీజేపీ ఎంపీలు ఎందుకు స్పందించడం లేదు? తేజస్వి సూర్య ఓ తెలివిలేని వ్యక్తి(అసభ్య పదజాలం వాడుతూ). తెలంగాణ ఏర్పాటుపై ఇంత అజ్ఞానంగా మాట్లాడతారా? రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన రాష్ట్రాన్నే అవమానిస్తారా.?



తేజస్వి రాజ్యాంగాన్ని కించపరిచేలా మాట్లాడారు. పోరాటం ద్వారా ఏర్పాటైన తెలంగాణను అవమానించారు' అని పొన్నం పేర్కొన్నారు.

## మహిళా బిల్లుతో దేశ రాజకీయాల
# దిశ, దశ మారతాయి

: ప్రధాని మోదీ

**లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం**

**బిల్లుపై మూజువాణి ఓటింగ్‌ను వ్యతిరేకించి డివిజన్‌కు పట్టుబట్టిన విపక్షాలు**

**ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 251, వ్యతిరేకంగా 185 ఓట్లు**

**బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని పార్టీలకు ప్రధాని విజ్ఞప్తి**

మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు నిర్ణయాధికార ప్రక్రియలో పాలుపంచుకోవడం ద్వారా దేశానికి కొత్త దిశానిర్దేశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కీలక బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కేంద్ర - మిగతా5లో



## సంపాదకీయం

# అన్ని రంగాలపై యుద్ధప్రభావం

పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు కేవలం భౌగోళిక రాజకీయాలకే పరిమితం కాలేదు. అవి గ్లోబల్ సప్లై చైన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. యుద్ధం అనేది మానవ సమాజానికి అత్యంత ప్రమాదకరం. చరిత్రలో జరిగిన ప్రపంచ యుద్ధాలు అపార నష్టాన్ని మిగిల్చాయి. యుద్ధం వల్ల కేవలం రెండు దేశాలకే కాదు, మొత్తం ప్రపంచానికే కోలుకోలేని నష్టం జరిగి ఆర్థిక సంక్షోభంలోకి అనివార్యంగా నెట్టబడతాయి. యుద్ధం వల్ల జరిగే ప్రధాన నష్టం ప్రాణనష్టం. లక్షలాది మంది సైనికులు, సాధారణ ప్రజలు తమ ప్రాణాలను కోల్పోతారు. అనేక కుటుంబాలు తమ బంధువులను కోల్పోయి దుఃఖంలో మునిగిపోతాయి. రెండోది ఆర్థిక నష్టం. యుద్ధం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. పరిశ్రమలు, వ్యవసాయం నిలిచిపోతాయి. ప్రభుత్వాలు రక్షణ ఖర్చుల కోసం భారీగా నిధులు ఖర్చు చేయాల్సి వస్తుంది. మూడవది మౌలిక సదుపాయాల నష్టం. యుద్ధ సమయంలో రహదారులు, వంతెనలు, భవనాలు ధ్వంసమవుతాయి. విద్యుత్, నీటి సరఫరా వంటి అవసరమైన సేవలు నిలిచిపోతాయి. నాలుగోది శరణార్థుల సమస్య. యుద్ధం కారణంగా ప్రజలు తమ ఇళ్లను వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఫలితంగా ఇరాన్?లో ఇప్పటికే ప్రజలు సంక్షోభంలో బతుకుతున్నారు. ప్రపంచ చమురు వాణిజ్యంలో 20 శాతం, భారతదేశ ముడి చమురు దిగుమతుల్లో 50 శాతం వాటా కలిగిన హోర్ముజ్ జలసంధి ప్రస్తుతం ఒ ప్రమాదకరమైన మలుపులో ఉంది. జల సంధి అధికారికంగా మూసివేయకపోయినా అక్కడ పెరిగిన ఇన్సూరెన్స్ రేట్లు, దాడులకు భయంతో షిప్పింగ్ కార్యాకలాపాలు స్తంభించిపోయాయి. దాదాపు 4500 భారతీయ ఎగుమతిదారులు, 1800 మంది దిగుమతిదారులు ఈ మార్గంపై ఆధారపడి ఉన్నారు. షిప్పింగ్ కంపెనీలు ఇప్పుడు వార్ రిస్క్ సర్ఛార్జ్, ఎమర్జెన్సీ ఫ్యూయల్ సర్ఛార్జ్ వంటి కొత్త పన్నులను విధిస్తున్నాయి. దీని వల్ల కంటైనర్ రవాణా ఖర్చు ఏకంగా రెండు వేల నుంచి మూడు వేల డాలర్ల వరకు పెరిగింది షిప్పింగ్ ఆలస్యం వల్ల వస్తువులు చేరడానికి పట్టే సమయంలో మరో పది నుంచి ఇరవై రోజులు పెరుగుతోంది. ఆసియాలోనే అతి పెద్ద ఆటోమొబైల్ విడిభాగాల మార్కెట్ అయిన ఢిల్లీలోని కశ్మీర్ గేట్‌లోని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ముడి చమురు ధరలు పెరగడం వల్ల ప్లాస్టిక్, రబ్బర్, ప్యాకేజింగ్ మెటీరియల్స్ ధరలు పెరిగాయి. మార్కెట్ నిపుణుల ప్రకారం విడిభాగాల తయారీ ఖర్చు 25 శాతం నుంచి 50 శాతం వరకు పెరిగింది. మరోవైపు ఇంధన ధరల పెరుగుదల వల్ల ఫ్యాక్టరీల్లో కార్మికులు స్వగ్రామాలకు తరలిపోతుండటంతో ఉత్పత్తి కుంటుపడింది. రబ్బర్ విడిభాగాల తయారీ ఖర్చు పది నుంచి 16 రూపాయలకి పెరగగా, ముడి చమురు ధరల పెరుగుదల వల్ల ప్లాస్టిక్ వస్తువుల ధరలు రెట్టింపు అవుతున్నాయి. దీనికి తోడు హుర్మూజ్ జలసంధి వద్ద సుమారు 2,300 పెట్రోలియం కంటైనర్లు నిలిచిపోవడం వల్ల సప్లై పూర్తిగా దెబ్బతింది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి తయారీదారులు ధరలను పెంచడం అనివార్యమని ప్రకటించారు. ముడిసరుకుల ధరలు పెరగడం వల్ల కార్లు, టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్ల ధరలు ఐదు శాతం నుంచి ఆరు శాతం వరకు పెరగనున్నాయి. మెర్సిడెస్ బెంజ్, ఆడి వంటి సంస్థలు ఇప్పటికే రెండు శాతం ధరల పెంపును ప్రకటించాయి. షూస్, ప్లాస్టిక్ ఆధారిత దుస్తుల ధరల 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. వాహన తయారీ సంస్థలు పాండమిక్ సమయంలో చేసినట్టుగానే క్రైసిస్ మేనేజ్‌మెంట్ టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. అల్యూమినియం, కాపర్, ఎలక్ట్రానిక్ విడిభాగాల కోసం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే మార్గాలను అన్వేషిస్తున్నాయి. అయినప్పటికీ భారత్ విడిభాగాలు దిగుమతుల్లో చైనా వాటా 30 శాతంగా ఉంది. జర్మనీ, దక్షిణ కొరియా నుంచి కూడా దిగుమతులు పెరుగుతున్నప్పటికీ, ప్రస్తుతం పరిస్థితుల్లో ధరల నియంత్రణ అనేది తయారీదార్లకు ఒక సవాల్‌గా మారింది. నేటి పరిస్థితులు చూస్తుంటే 1970 నాటి అంతర్జాతీయ సంక్షోభాన్ని గుర్తు తెస్తుందని నిపుణులు చెబుతున్నారు. కేవలం చమురు మాత్రమే కాదు, టైల్స్, పేపర్, పెట్రోకెమికల్ ఉత్పత్తులపై ఆధారపడిన పరిశ్రమలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. పశ్చిమాసియాలో జరుగుతున్న ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం గత నెల రోజులుగా తీవ్రస్థాయిలో కొనసాగుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. యుద్ధంపై అమెరికా ఇప్పటికే 27 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. యుద్ధానికి ప్రతి సెకనుకు 10,300 వేల డాలర్స్ ఖర్చు అవుతున్నాయి, ఆయుధాలకు, 320మిలియన్, విమానాలకు 245 మిలియన్, నేవీకి 155 మిలియన్, రక్షణ వ్యవస్థకు 95 మిలియన్ డాలర్లు, దీనివలన భవిష్యత్ లో అమెరికా ఎదుర్కొనే సంక్షోభం గ్రహించి అమెరికా చరిత్రలో తొలిసారి 50 రాష్ట్రాలలో 'నో కింగ్ నో వార్' నినాదంతో లక్షలాది ప్రజలు నిరసన వ్యక్తం చేశారు, ఇరాన్, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలు యుద్ధం ముగియాలని కోరుకుంటున్నాయి. కానీ అమెరికా అవలంబిస్తున్న విధానాల వలన యుద్ధం ఇప్పట్లో ముగిసే అవకాశాలు కనిపించడం లేదు. హార్మూజ్? జలసంధి తెరిచేందుకు ప్రయత్నిస్తే ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయి. నాటో కూటమిని ట్రంప్ మద్దతు కోరినా సానుకూల స్పందన లేదు. దీనితో అమెరికా దిక్కు తోచని పరిస్థితుల్లో కూరుకుపోయిందని అర్థమవుతోంది. ఇరాన్, ఇజ్రాయెల్ ఇతర గల్ఫ్ దేశాలు అనేక రకాల నష్టాలు ఎదుర్కొంటున్నాయి. తిరిగి కోలుకోవడానికి ఎన్ని ఏండ్లు పడుతుందో చెప్పలేం. అమెరికా సైనిక స్థావరాల మీద ఇరాన్ దాడులు చేయడం కొనగిస్తూనే వుంది. పైగా అమెరికాకు చెందిన 18 కంపెనీలపై దాడులు చేస్తామని హెచ్చరించడంతో లక్షలాది ఉద్యోగులు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ ఇరాన్ పై నిరంతర దాడులు చేస్తోంది, అయితే యుద్ధంతో ఎలాంటి సంబంధం లేని భారతదేశం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. అన్ని రంగాలలో సంక్షోభం నెలకొంది. యుద్ధ ప్రభావంతో తగ్గిన నౌకల రవాణా వల్ల ముడి సరుకు దిగుమతి తగ్గి రెట్టింపు స్థాయిలో ధరలు పెరిగాయి. ఒక్క ఫార్మా రంగంలోనే మార్చినెలలో రూ. 5000 కోట్లు నష్టం జరిగింది అని అంచనా వేస్తు న్నారు. చమురు, గ్యాస్ ధరల పెరుగుదల, ఆహార పదార్థాల కొరత, వలన సామాన్య ప్రజలకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తప్పని పరిస్థితి. వ్యవసాయ రంగంలో కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది,

# గీసుగొండలో ఘనంగా 'బడిబాట'..

## సర్కారీ బడుల వైపు గ్రామం అడుగులు!

**గీసుగొండ, ఏప్రిల్ 16 । అక్షర సవాల్ ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి నివేదిక' కార్యక్రమంలో భాగంగా గీసుగొండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచి, సర్కారీ విద్యను మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ధ్యేయంగా నిలిచింది.

**హోరెత్తిన బడిబాట ర్యాలీ**

పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుడికాల సుభాష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. "సర్కారీ బడిలో చేరుదాం -- బంగారు భవిష్యత్తును అందుకుందాం" అంటూ నినాదాలతో గ్రామమంతా మార్మోగింది. విద్యార్థులు పాఠశాల అభివృద్ధి, అందుబాటులో ఉన్న సదుపాయాలను వివరిస్తూ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు.

**సర్కారీ బడుల్లో మెరుగైన సదుపాయాలు**

గ్రామ సచివాలయం వద్ద జరిగిన అవగాహన సభలో సర్పంచ్ వీరగొని రాజ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పలు సంక్షేమ వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, రెండు జతల యూనిఫాంలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపకుండా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజ్‌కుమార్‌తో పాటు ఎపిఎస్ చైర్మన్ దొడ్డ మమత, జడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు కె. సుభాష్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఏ. నమ్రత, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై గ్రామస్థుల్లో విశ్వాసం పెంచుతూ, విద్యార్థుల నమోదు పెంపే లక్ష్యంగా గీసుగొండలో 'బడిబాట' కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.



# తెలంగాణ ఆత్మగౌరవంపై విషపు వ్యాఖ్యలు..

**బీజేపీపై బీఆర్ఎస్ ఆగ్రహం**

**హన్మకొండ, ఏప్రిల్ 16 అక్షర సవాల్:** తెలంగాణ ఏర్పాటును ఇండియా--పాకిస్తాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై బీఆర్ఎస్ తీవ్ర స్థాయిలో మండిపడింది. పార్లమెంట్ చర్చల నేపథ్యంలో వచ్చిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ 60 ఏళ్ల ఉద్యమ చరిత్రను, అమరవీరుల త్యాగాలను అవమానించేలా ఉన్నాయని మాజీ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మహోన్నత పోరాటాన్ని తక్కువ చేసి మాట్లాడటం అంటే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆయన అన్నారు. దేశం మొత్తం ఆశ్చర్యపోయేలా సాగిన ఉద్యమాన్ని బీజేపీ నేతలు పదేపదే అవమానించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోడీ సహా బీజేపీ అగ్రనేతలు తెలంగాణ ఏర్పాటుపై పలుమార్లు అవమానకర వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు తేజస్వి సూర్య వ్యాఖ్యలు అదే ధోరణికి కొనసాగింపని మండిపడ్డారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల గౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి వ్యాఖ్యలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరని హెచ్చరించారు.



"తెలంగాణ కోసం కొట్లాడేది బీఆర్ఎస్, కేసీఆర్ గులాబీ సైన్యమే" అని పేర్కొంటూ, కె. చంద్రశేఖర్ రావు చెప్పిన "ఇంటి పనికైనా మట్టి పనికైనా మనోడు ఉండాలి" అన్న మాటల ప్రాముఖ్యత ఇలాంటి సందర్భాల్లో స్పష్టమవుతోందన్నారు. చివరగా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఇండియా--పాకిస్తాన్ విభజనతో పోల్చడం బీజేపీ మూర్ఖపు రాజకీయ ఆలోచనకు నిదర్శనం అని తీవ్రంగా ఖండిస్తూ, తేజస్వి సూర్య బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# తొలి సినిమా పాటల రచయిత తంగేళ్ల భాస్కర్ కు ఘన సన్మానం

**నల్లబెల్లి మండలం ఏప్రిల్ 16:అక్షర సవాల్ :**నల్లవెల్లి మండల కేంద్రంలో ఇండియన్ ఫిలిం మేకర్ ఆర్కే బ్లాక్ బస్టర్ సంస్థ బ్యానర్ పై సినీ దర్శకుడు డాక్టర్ మెన్ మెహమూద్ నజీర్ కదా స్క్రీన్ ప్లే తో పాటు దర్శకత్వం వహిస్తున్న తెలుగు చిత్రం,"జూలుం "సినిమాకు పాటల రచయితగా తొలి పరిచయం అవుతున్న తెలంగాణ ఉద్యమకార్లపురం మండల శాఖ అధ్యక్షులు తంగేళ్ల భాస్కర్ ని ఈరోజు నల్లవెల్లి మండల కేంద్రంలోని గ్రామ సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ ఉద్యమకారులు ఘనంగా సత్కరించడం జరిగింది. తంగేళ్ల



భాస్కర్ కు మరిన్ని సినిమా అవకాశాలు రావాలని పలువురు వక్తలు ప్రసంగించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల సాంబారావు జేపీసీ మండల చైర్మన్ వేముల రాజు యనమల నర సయ్య ఉద్యమకార్లపురం జిల్లా కార్యదర్శి గట్టు సాంబయ్య ఉద్యమకారులు పల్లికొండ రవి కొత్తగట్టు ప్రభాకర్ ఖ్యాతం శీను మామిళ్ళ పెద్దలయ పులి రమేష్ గౌడ్ మొదలగు వారు పాల్గొన్నారు .

## రోడ్డు ప్రమాద నివారణకు పోలీసుల తక్షణ చర్య...

**గుంత పూడ్చి ఆదర్శం చూపిన కానిస్టేబుల్, హోంగార్డ్**



**గీసుగొండ, ఏప్రిల్ 16 అక్షర సవాల్:** హర్జ్య తండా -- వరంగల్ నుంచి నర్సంపేట వెళ్లే ప్రధాన రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సందర్భంగా పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్ కుమార్, హోంగార్డ్ సుకుమార్ రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న పెద్ద గుంతను గుర్తించారు. ఆ గుంత వల్ల వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భావించిన వీరిద్దరూ వెంటనే స్పందించి, ఆలస్యం చేయకుండా స్వయంగా గుంతను పూడ్చి రహదారిని సురక్షితంగా మార్చారు. సాధారణ విధి నిర్వహణకే పరిమితం కాకుండా, ప్రజల భద్రతను ప్రథమంగా భావిస్తూ తీసుకున్న ఈ తక్షణ చర్యను సీఐ విశ్వేశ్వర్ అభినందించారు. ప్రజల ప్రాణ భద్రతే ముఖ్యమనే సందేశాన్ని ఈ ఘటన మరింత బలంగా చాటిందని ఆయన పేర్కొన్నారు. పోలీసుల ఈ స్పందనాత్మక చర్యకు స్థానికంగా కూడా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## ఉపాధి కూలీలకు తప్పని ఫేస్ స్కాన్ తిప్పలు



**మంగపేట/తాడ్వాయి, ఏప్రిల్ 16, అక్షర సవాల్:**ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో ఉపాధి హామీ పథకం కూలీలకు ఫేస్ స్కాన్ ద్వారా హాజరు నమోదు చేసే విధానం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. మండలంలోని బంగారు నర్సయ్య కుంటలో పనికి వెళ్లిన ఒక కూలీకి, నిలబడి ఉన్నప్పుడు ఫేస్ స్కాన్ కాకపోవడంతో అధికారులు వింత నిర్ణయం తీసుకున్నారు. సదరు కూలీని నేలపై పడుకోబెట్టి ఫేస్ స్కాన్ చేసి హాజరు నమోదు చేయాల్సి వచ్చింది. ఈ విధానం తమ గౌరవాన్ని దెబ్బతీస్తోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక సమస్యలు ఉన్న చోట్ల ప్రత్యామ్నాయ హాజరు విధానాన్ని అమలు చేయాలని ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

# భద్రతా నియమాలను పాటించండి..

**సిద్దిపేట పోలీసుల వినూత్న కార్యక్రమం**

**సిద్దిపేట:**రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా సిద్దిపేట జిల్లా పోలీస్ యంత్రాంగం 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని వాహన షోరూమ్, పెట్రోల్ బంక్ నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఒక ప్రత్యేక ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని షోరూమ్‌ల,బంకుల యజమానుల సహకారంతో, ప్రతి షోరూమ్ ప్రాంగణంలో మరియు పెట్రోల్ బంక్ ఆవరణలో రోడ్డు భద్రతా నియమాలను వివరించే బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త వాహనం కొనుగోలు చేసే ప్రతి వినియోగదారుడికి, చోదకులకు రోడ్డు నిబంధనలపై ప్రాథమిక అవగాహన కల్పించడం ఈ చర్య వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం.ప్రతి ప్రయాణం సురక్షితంగా సాగాలన్నదే మా ఆకాంక్ష. షోరూమ్ స్టేక్ హోల్డర్స్ అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం అభినందనీయం. వాహనదారులు కేవలం నిబంధనల కోసమే కాకుండా, తమ కుటుంబ సభ్యుల కోసం రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ సూచించారు.ప్రజలు పోలీసులకు సహకరించి, రోడ్డు భద్రతను ఒక సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కోరుతున్నాము మీ భద్రతే మా ప్రాధాన్యత.

## కొనసాగుతున్న విద్యుత్ అర్టిసన్ల సమ్మె

**రంగారెడ్డి:** రాజేంద్రనగర్ సర్కిల్ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న అర్టిసన్ ల ఉద్యోగులు తమకు సమాన పనికి సమాన వేతనం కావాలంటూ ఆందోళన బాట పట్టారు. తెలంగాణ రాష్ట్రం విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిసన్ ఉద్యోగులు ఆరు ప్రధాన డిమాండ్లతో ఆందోళన బాట పట్టారు. గత 9 రోజులుగా విధులను బహిష్కరించి సమ్మెకు దిగారు. ఆరు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం యాజమాన్యం తక్షణమే అమలు చేయాలంటూ 10 యూనియన్లు జాయింట్ యాక్షన్ కమిటీగా తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీవిఎజెఏసి) గా ఏర్పడి ఆందోళన బాటపట్టారు. ఈరోజు కార్మికుల నిర్వహిస్తున్న ధర్నాకు రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ పటోళ్ల కార్తిక్ రెడ్డి, ఎమ్మెల్సీ రహమత్ బేగ్ మద్దతు పలికారు ఆర్టిజన్ ఉద్యోగులలో విద్యార్హతలను బట్టి ఉద్యోగుల కన్వర్షన్ చేయాలి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఏపీఎస్ఇబి సర్వీస్ రూల్స్ అంటే ప్రస్తుతం ఉన్న ఓ అండ్ ఎం సర్వీస్ రూల్స్ ను అమలు చేయాలి. ఆన్ మాండ్ వర్కర్లను ఆర్టిజన్ లను విలీనం చేయాలి 2016 డిసెంబర్ కన్నా ముందు నుండి విద్యుత్ సంస్థలో పనిచేస్తూ నేటికి అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిని ఆర్టిసన్ ఉద్యోగులుగా గుర్తించాలి. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న పీస్ రేట్ కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలి. 2026 పి ఆర్ సి వేతన సవరణ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసారు.

## వాటర్ ట్యాంకులకు ఫుల్ డిమాండ్



**హైదరాబాద్, ఏప్రిల్ 16:** ఎండాకాలం వచ్చిందంటే చాలూ హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడుతుంది. ఈ క్రమంలో వాటర్ ట్యాంకర్‌లకు డిమాండ్ భారీగా పెరుగుతుంది. మార్చి 2025లో సుమారు 2.1 లక్షల ట్యాంకర్లు బుక్ చేయగా, ఈ ఏడాది ఆ సంఖ్య 2.24 లక్షలకు చేరింది. ప్రస్తుతం రోజుకు సగటున 7,500 బుకింగ్స్ నమోదవుతుండటం పరిస్థితి తీవ్రతనుతెలియజేస్తోంది. పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, వాటర్ బోర్డు ట్యాంకర్ల సరఫరాను వేగవంతం చేయడానికి చర్యలు చేపట్టింది. బుకింగ్ చేసిన 12 గంటల్లోనే ట్యాంకర్ పంపించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నారు. అయితే నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం డిమాండ్ ఎక్కువగా ఉంది. ముఖ్యంగా మణికొండ, బంజారాహిల్స్, హఫీజ్‌పేట్, నేటాజీ పార్క్ ఫిల్లింగ్ స్టేషన్ల పరిధిలో నీటి కొరత తీవ్రంగా ఉండడంతో ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. పెండింగ్ బుకింగ్స్‌ను త్వరగా క్లియర్ చేయడానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. తక్కువ డిమాండ్ ఉన్న ప్రాంతాల నుంచి ఎక్కువ అవసరం ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్లను మళ్లిస్తూ పంపిణీని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. అదనంగా నైట్ షిఫ్ట్‌లను పెంచి, అవసరమైతే సిబ్బందికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని కూడా సూచించారు. ఇక నీటి వినియోగంపై కూడా అధికారులు కీలక సూచనలు చేస్తున్నారు. ముఖ్యంగా గృహాల్లో నీటిని బాధ్యతగా వినియోగించాలని, కనీసం 20 శాతం వరకు వినియోగాన్ని తగ్గించాలని సూచించారు, లీకేజీలు వెంటనే సరిచేయడం వంటి చిన్నచిన్న చర్యల ద్వారా నీటిని ఆదా చేయవచ్చని అధికారులు పేర్కొన్నారు.

## తాజ్‌మహల్ తరహాలో చార్మినార్ అభివృద్ధి

**మంత్రి జూపల్లి కృష్ణారావు**



హైదరాబాద్: ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను చూసేందుకు సందర్శకులు ఎలా తరలివస్తారో, అలా చార్మినార్‌కు కూడా వచ్చేలా అభివృద్ధి చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. టూరిజం ఎండీ గౌతమి, పురావస్తు, కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీతో కలిసి చార్మినార్, సర్దార్ మహల్, చౌమహల్లా ప్యాలెస్, గుల్జర్ హౌస్, పత్తర్‌ఘట్టి, లాడ్ బజార్ తదితర ప్రాంతాలను పరిశీలించారు, టూరిజం ప్రమోషన్‌లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక కట్టడాల అభివృద్ధికి కృషి చేస్తోందని మంత్రి తెలిపారు.

**రోప్ వే'పై మంత్రి ఆరా**

కుతుబ్ షాహీ టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కిలోమీటర్ల రోప్‌వే నిర్మాణ ప్రతిపాదనలపై పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరా తీశారు. టూంబ్స్‌లోని ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్‌లో జరుగుతున్న పనులను కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహియుద్దీన్‌తో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం రోప్ వే పనుల గురించి చర్చించారు. గోల్కొండ కోట సమీపంలోని బస్టాప్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం కటోరా హౌస్, ఖజానా బిల్డింగ్ మ్యూజియంను సందర్శించారు. ఈ కార్యక్రమంలో టీజీడీసీ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జునరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

**తనపై నమ్మకంతో కాంగ్రెస్ అవకాశం ఇచ్చిందన్న నరేందర్ రెడ్డి**

**తెలంగాణ హక్కులపై సభలో పోరాటం చేస్తానని వెల్లడి**

**ప్రమాణ స్వీకారం చేసిన కొత్తగా ఎన్నికైన సభ్యులు**



తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేం నరేందర్ రెడ్డి ఈరోజు రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల పలువురు నేతలు రాజ్యసభకు ఎన్నికైన విషయం తెలిసిందే. కొత్తగా ఎన్నికైన సభ్యులు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం, వేం నరేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తన మీద నమ్మకంతో రాజ్యసభ ఎంపీగా అవకాశం ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలు, సమస్యలు, రాష్ట్ర హక్కులు, రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి పార్లమెంటులో పోరాటం చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల వికాసం, అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, తెలంగాణ నుంచి ఎన్నికైన మరో కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వీ తదితరులు కూడా ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు.

## కాంగ్రెస్ నేత జావేద్ కు మంత్రి పొంగులేటి నివాళులు

**ఖమ్మం:** సూర్యాపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు మహ్మద్ జావేద్ పార్థివ దేహానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాళులర్పించారు. ఖమ్మం పట్టణం రెడ్ హిల్స్ లోని మహ్మద్ జావేద్ స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. మహ్మద్ జావేద్ అకాల మరణం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కు తీరని లోటు..వారు కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయం..వారి కుటుంబానికి పార్టీ అన్నివేళల అండగా ఉంటుందని మంత్రి అన్నారు.

# త్రిపుల్ ధమాకా.. ఒకేసారి మూడు నెలల కోటా



**నల్గొండ, ఏప్రిల్ 16:** తెలంగాణలోని రేషన్ కార్డుదారులకు ఊరటనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ నెలకు సంబంధించి రేషన్ పంపిణీ గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించింది. సాధారణంగా నెల మధ్యలోనే ముగిసే పంపిణీ గడువును, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నెలాఖరు వరకు పెంచుతూ పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసిందవేసవిలో ఎండల తీవ్రత పెరగడం, రాబోయే నెలల్లో వడగాల్పుల ముప్పు ఉండటంతో లబ్ధిదారులు ప్రతి నెలా షాపుల వద్ద క్యూ కట్టకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది. ఇందులో భాగంగా ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన కోటాను మొత్తం 18 కేజీల సన్నబియ్యం - నెలకు 6 కేజీల చొప్పున ఈ నెలలోనే ఒకేసారి పంపిణీ చేస్తోంది. దీనివల్ల లబ్ధిదారులు మే, జూన్ నెలల్లో ఎండలో ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు. మూడు నెలల సరుకులు ఒకేసారి ఇస్తుండటంతో, ఇప్పుడు తీసుకోకపోతే మళ్ళీ దొరకవేమోనన్న ఆందోళనతో లబ్ధిదారులు భారీగా రేషన్ షాపులకు తరలివస్తున్నారు. దీనివల్ల సర్వర్లపై ఒత్తిడి పెరిగి ఈ-పోస్ (వ-ాశీూ) యంత్రాలు మొరాయిస్తున్నాయి. ఈ రద్దీని గమనించిన ప్రభుత్వం, లబ్ధిదారులు కంగారు పడాల్సిన పనిలేదని, ఈ నెల 30 వరకు ఎప్పుడైనా సరుకులు తీసుకోవచ్చని స్పష్టం చేసిందిఈ భారీ పంపిణీ వెనుక మరో వ్యూహాత్మక కారణం కూడా ఉంది. కొత్త సీజన్ ధాన్యం సేకరణ ప్రారంభమవుతున్న తరుణంలో, గోదాముల్లో ఉన్న పాత నిల్వలను ఖాళీ చేసి కొత్త ధాన్యానికి చోటు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సరుకుల నిర్వహణను సులభతరం చేయడానికి ఈ అడ్వాన్స్ పంపిణీ ప్రక్రియను చేపట్టింది. మూడు నెలల కోటా కోసం మూడుసార్లు వేలిముద్ర వేయాల్సిన అవసరం లేదు. ఒక్కసారి ధృవీకరణతోనే మూడు నెలల సరుకులు పొందవచ్చు. గడువు నెలాఖరు వరకు ఉన్నందున, ఉదయం వేళల్లో కాకుండా రద్దీ తక్కువగా ఉండే సమయాల్లో వెళ్లి సరుకులు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం ఈసారి కూడా నాణ్యమైన సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తోంది, కాబట్టి నిల్వ చేసుకున్నా పాడవుతాయన్న భయం అక్కర్లేదు. ప్రభుత్వం తీసుకున్న ఈ గడువు పొడిగింపు నిర్ణయం వల్ల రాష్ట్రంలోని సుమారు 1.05 కోట్ల రేషన్ కార్డుదారులకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేదలకు మరియు వృద్ధులకు పెద్ద ఉపశమనం లభించనుంది.

# మెట్రోతో మినీ ఎలక్ట్రిక్ బస్సుల లింక్

**హైదరాబాద్, ఏప్రిల్ 16:** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. త్వరలోనే ప్రయాణ కష్టాలు తప్పనున్నాయి. ప్రస్తుతం మెట్రోరైలు దిగి ప్రయాణికులు తిరిగి తమ చివరి గమ్యం చేరేందుకు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా మెట్రో స్టేషన్ల నుంచి మినీ ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తుండగా.. త్వరలోనే మినీ ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఇక ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో చాలా వరకు ఎలక్ట్రిక్ బస్సులే నడుస్తుండగా.. వాటిని ఛార్జ్ చేసేందుకు ఇంటర్మిటెంట్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఆర్టీసీ రెడీ అయింది. హైదరాబాద్ మెట్రో ప్రతి నిత్యం దాదాపు 5 లక్షల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చుతోంది. నగరం ఓ మూల నుంచి మరో మూలకు చేరుకోవాలంటే చాలా మంది మెట్రో ట్రైన్లను ఆశ్రయిస్తుంటారు. అయితే ఈ మెట్రో సేవలు నగర వ్యాప్తంగా లేకపోవటంతో చాలా మంది మెట్రో దిగిన తర్వాత తమ తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు బస్సులు, ఆటోలను ఆశ్రయిస్తుంటారు. అయితే చాలా వరకు మెట్రో స్టేషన్ల సమీపంలో బస్టాండ్లు అందుబాటులో ఉండటం లేదు. చాలా దూరం నడిచి వెళ్లాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ మెట్రో ప్రయాణికులకు తీపి కబురు చెప్పింది. మెట్రోరైలు దిగి ప్రయాణికులు తిరిగి తమ చివరి గమ్యం చేరేందుకు ఫీడర్ సర్వీసులుగా మినీ ఎలక్ట్రిక్ బస్సులను ఉపయోగించాలని ఆర్టీసీ నిర్ణయించింది. మెట్రో స్టేషన్ సమీపం నుంచి ఈ మినీ ఎలక్ట్రిక్ బస్సులను సమీప కాలనీలకు నడపనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే ఈ ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులనే నడిపేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు ఇంటర్మిటెంట్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై ఆర్టీసీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ప్రధాన టెర్మినల్ పాయింట్లు అయిన పటాన్‌చెరు, ఆరాంఘర్, ఎల్బీనగర్, ఉప్పల్, వనస్థలిపురం, గచ్చిబౌలి, కేపీహెచ్‌బీ కాలనీ, చిలకలగూడ, బాలానగర్, మెహిదీపట్నం, గండిమైసమ్మ, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఈ ఛార్జింగ్‌స్టేషన్లు అవసరమని తాజాగా ఆర్టీసీ అదికారులు గుర్తించారు. ఇందుకు 1500 నుంచి 2500 చదరపు మీటర్ల చొప్పున భూమి కావాలని ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపింది. సూచించిన ఆయా ప్రాంతాల్లోని భూములను గుర్తించి జాబితా ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆర్టీసీ యాజమాన్యం కోరింది. ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్న సమయంలో లేదా టెర్మినల్ వద్ద ఇంటర్మిటెంట్ ఛార్జింగ్ స్టేషన్లు 10 నుంచి 20 నిమిషాలు పాక్షికంగా బ్యాటరీని ఛార్జ్ చేస్తాయి. దీనినే అపర్చునిటీ ఛార్జింగ్ అని అంటారు. బస్సు రూట్ చివరి పాయింట్ లేదా మధ్యలోని ప్రధాన స్టాప్‌ల వద్ద వీటిని అందుబాటులోకి తీసుకొస్తారు.



ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసే 300 నుంచి 600 కిలోవాట్ హై పవర్ ఛార్జర్లు ఎలక్ట్రిక్ బస్సులను త్వరగా ఛార్జ్ చేయనున్నాయి. వీటితో పాటు అన్ని బస్సులు ఒకేసారి రాత్రి డిపోలో ఛార్జ్ చేస్తే విద్యుత్ గ్రిడ్‌పై భారం పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ కేంద్రాలతో ఆ ఇబ్బంది తొలిగిపోనుంది. ఆర్టీసీ బస్సు డిపోకు తిరిగొచ్చిన తర్వాత పూర్తిగా ఛార్జ్ చేయాల్సిన అవసరం తగ్గుతుంది. టెర్మినల్‌లో 10 నుంచి 15 నిమిషాల లేఓవర్‌లోనే టాప్‌అప్ చేసుకొని మళ్లీ ఆయా రూట్‌లోకి వెళ్లొచ్చు. దీని వల్ల బస్సులను ఎక్కువ ట్రిప్పులు తిప్పటానికి అవకాశం ఉండటంతో పాటు సుదూర మార్గాల్లో ప్రయాణ సేవలు అందించొచ్చు.

# ఓఆర్ఆర్ సమీపంలో హైస్పీడ్ రైలు



**హైదరాబాద్, ఏప్రిల్ 16:** హైదరాబాద్ ఓఆర్ఆర్ సమీపంలో హైస్పీడ్ రైలు రానుంది. దీనికి సంబంధించిన హైస్పీడ్ రైల్ కారిడార్ టెర్మినల్‌ను శంషాబాద్‌లో ఏర్పాటు చేయనున్నారు. నాలుగు రవాణా వ్యవస్థలతో జంక్షన్ అభివృద్ధి చేయనున్నారు. మెట్రో దిగిన వెంటనే రైలు ఎక్కేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ హైస్పీడ్ రైలు ప్రాజెక్టు కోసం బహుదూర్ గూడలో 650 ఎకరాల భూమిని కేటాయించారు. మరోవైపు.. శంషాబాద్ వరకు విస్తరించనున్న మెట్రోను కూడా ఈ హైస్పీడ్ రైలు హబ్‌కు అనుసంధానం చేసేందుకు అధికారులు ఆలోచిస్తున్నారు. దేశంలో రవాణా వ్యవస్థను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనేక ప్రాజెక్టులు చేపడుతున్న సంగతి తెలిసిందే. కొత్త ఎయిర్‌పోర్టులు, కొత్త రైల్వే ప్రాజెక్టులు, నేషనల్ హైవే ప్రాజెక్టులను నిర్మిస్తోంది. అందులో భాగంగానే దేశంలోని కీలక నగరాలను రైల్వే మార్గంతో కలిపేలా.. అత్యంత వేగంగా ఒక నగరం నుంచి మరో నగరానికి చేరుకునేలా.. ప్రతిష్ఠాత్మక హైస్పీడ్ రైలు ప్రాజెక్టును చేపడుతోంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఈ హైస్పీడ్ రైలు ప్రాజెక్టులో కీలకమైన జంక్షన్ నిర్మించనున్నారు. ఇందులో భాగంగానే శంషాబాద్ మండలంలోని బహుదూర్ గూడ, రషీద్ గూడ, చిన్న గొల్కొండ ప్రాంతం ఈ హైస్పీడ్ రైలు జంక్షన్‌కు అనువుగా ఉంటుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ 3 గ్రామాల పరిధిలో సుమారుగా 500 ఎకరాల భూమి అందుబాటులో ఉండనున్నట్లు సమాచారం. హైదరాబాద్-బెంగళూరు.. హైదరాబాద్-పుణె, హైదరాబాద్-చెన్నై కారిడార్లలో ఈ హైస్పీడ్ రైలు పరుగులు పెడుతూ.. హైదరాబాద్, బెంగళూరు, పుణె, చెన్నై నాలుగు నగరాలను కలుపనుంది. ఇక ఈ 3 కారిడార్లను హైదరాబాద్ కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు శంషాబాద్ మండలం బహదూర్‌గూడలోని సర్వే నంబర్లు 28, 62లలో 650 ఎకరాల భూమిని ఇప్పటికే అధికారులు గుర్తించారు. ఈ మూడు కారిడార్ల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 2026--27 వార్షిక బడ్జెట్లో రూ.43,848 కోట్లతో ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రతిపాదనలు చేసింది. ఇప్పటికే హై స్పీడ్ రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మరోవైపు.. హైదరాబాద్ మెట్రో రైలును శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు పొడిగించే ప్రతిపాదనలను తెలంగాణ ప్రభుత్వం రెడీ చేసింది. ఈ మెట్రో రైలును కూడా కొత్తగా నిర్మించే హైస్పీడ్ రైల్ కారిడార్ జంక్షన్‌కు అనుసంధానం చేయడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను రాష్ట్ర సర్కార్ పరిశీలిస్తుంది. హైదరాబాద్ మెట్రో రెండో దశలో భాగంగా నాగోల్ నుంచి ఎల్బీనగర్, చంద్రాయణగుట్ట మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు 36.8 కిలోమీటర్ల మేర విస్తరించనున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీ వరకు సుమారుగా 40 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరించేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. రోడ్డు, రైలు, మెట్రో రైలు, ఎయిర్‌పోర్టుతో కలిపి మొత్తం 4 మార్గాలను కొత్తగా నిర్మించనున్న హైస్పీడ్ రైల్ కారిడార్ జంక్షన్‌తో కలిపేందుకు అధికారులు ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్ లో రోగి మృతి..

**బంధువుల అందోళన**




**ఎల్బీనగర్:** కామినేని హాస్పిటల్ లో డాక్టర్లు నిర్లక్ష్యం వల్ల నరేష్ అనే వ్యక్తి మృతి చెందాడని బంధువుల అందోళనకు దిగారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంకు చెందిన నరేష్ (38) అనే వ్యక్తి నారాయణ కాలేజీలో లెక్చరర్ గా పనిచేస్తాడు. గుండెలో చిన్న నొప్పి ఉందని నడుచుకుంటూ హాస్పిటల్ కి వచ్చాడు. 8 లక్షలు ఖర్చు అవుతుందని హాస్పిటల్ యజమాన్యం చెప్పారు. 5 లక్షలు రూపాయలు ఇన్సూరెన్స్ డబ్బులు తీసుకొని ఆపరేషన్ స్టార్ట్ చేశారు. తరువాత నరేష్ మృతి చెందాడు. జూనియర్ డాక్టర్లతో ఆపరేషన్ చేశారని బంధువుల ఆరోపణ. మాకు న్యాయం చేయాలంటూ కామినేని హాస్పిటల్ ముందు ఆందోళనకు దిగారు.

## లైసెన్సు లేకుండా బండి నడపవద్దు....

**రోడ్డు భద్రత గురించి విద్యార్థులకు అవగాహన....**

**హెల్మెట్ తప్పనిసరి.... అంజిరెడ్డి**

**ట్రాఫిక్ ఎస్ఐ కోదాడ.**



గురువారం నాడు కోదాడ పట్టణంలో పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో కోదాడ పట్టణం ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి పాల్గొని మాట్లాడినారు. తెలంగాణ రాష్ట్రం" ప్రజా పాలన ప్రణాళికా ప్రగతి "కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత పాటించవలసిన నియమ నిబంధనలను తెలియజేసినారు. విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే, వారి తల్లిదండ్రులకు జైలు శిక్ష పడుతుందని, త్రిబుల్ రైడింగ్ చేయవద్దు, వాహనంపై నడిపే వారితో పాటు కూర్చున్న వారు కూడా హెల్మెట్ ని ధరించాలని , అతివేగంగా వాహనాలు నడపొద్దు ప్రాణాలను కోల్పోవద్దు అని విద్యార్థులకు తెలియజేప్పినారు. సెల్ ఫోనులో వాట్సప్ ఫేస్బుక్ ఇంస్టాగ్రామ్ లలో పరిచయం లేని వారి రీల్స్ చూడవద్దు, లింకులు తెరవొద్దు, విద్యా విషయ పరిజ్ఞానం కోసమే సెల్ ఫోన్ ఉపయోగించాలని, సైబర్ క్రైమ్ దూరంగా ఉండాలని, విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి, తల్లిదండ్రులకు సంతోషాన్ని కీర్తి ప్రతిష్టలు తేవాలని, ఉజ్వల భవిష్యత్తు కోసం కష్టపడాలని తెలిపినారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ, ట్రాఫిక్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ క్రీడలకు బీఆర్ఎస్ హామీ

## అంతర్జాతీయ స్థాయికి ఓరుగల్లు ఆటగాళ్లు:కేటీఆర్

**వరంగల్ పశ్చిమ, ఏప్రిల్ 16 । అక్షర సవాల్ ప్రతినిధి:** తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా బలమైన క్రీడా విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని, రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామ రావు పేర్కొన్నారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన కేసీఆర్ క్రికెట్ కప్ 8వ ఎడిషన్ పోటీల విజేతలకు హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో చెక్కులు, ట్రోఫీలు ప్రదానం చేసిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో క్రీడలకు ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావాలంటే సమగ్ర స్పోర్ట్స్ పాలసీ తప్పనిసరిగా అవసరమని కేటీఆర్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, పేద క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం, మౌలిక సదుపాయాలు, శిక్షణ అవకాశాలు కల్పిస్తే వారు అంతర్జాతీయ వేదికలపై రాష్ట్రానికి కీర్తి తీసుకురాగలరని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. క్రీడలను ప్రోత్సహించడం ద్వారా యువతను ఆరోగ్యకరమైన దిశలో నడిపించవచ్చని, అదే రాష్ట్ర అభివృద్ధికి కూడా తోడ్పడుతుందని పేర్కొన్నారు. వినయన్న ఆధ్వర్యంలో గత ఎనిమిదేళ్లుగా విజయవంతంగా కొనసాగుతున్న కేసీఆర్




క్రికెట్ కప్ టోర్నమెంట్ స్ఫూర్తిదాయకమని కేటీఆర్ కొనియాడారు. ఈ టోర్నమెంట్‌ను ఆదర్శంగా తీసుకుని వచ్చే సంవత్సరం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు. వరంగల్ పశ్చిమ గులాబీ శ్రేణులు, కాకతీయ క్రికెట్ అకాడమీ సభ్యులు క్రీడా అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఎనిమిదేళ్లుగా నిరంతరాయంగా ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం గర్వకారణమన్నారు. హనుమకొండ జిల్లా పరిధిలోని పేద క్రీడాకారులకు చేయూతనందిస్తూ వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే ఈ పోటీల ప్రధాన లక్ష్యమని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడిని, టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన కాకతీయ క్రికెట్ అకాడమీ బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కేసీఆర్ క్రికెట్ కప్ 8వ ఎడిషన్‌లో 51వ డివిజన్ జట్టు విజేతగా నిలవగా, 49వ డివిజన్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. డిపార్ట్‌మెంట్ క్రికెట్ విభాగంలో అంజలి కిడ్నీ కేర్ సెంటర్ హాస్పిటల్ జట్టు విజేతగా, సంకీర్తన హాస్పిటల్ జట్టు రన్నర్‌అప్‌గా నిలిచాయి. ఈ జట్లకు కేటీఆర్ చేతుల మీదుగా నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో కాకతీయ క్రికెట్ అకాడమీ ఫౌండర్ చైర్మన్ ఫారుక్ అలీ, సభ్యులు మాజీద్, వీరు, సిరాజ్, రాజేష్, రాంబాబు తదితరులతో పాటు పలువురు కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు, క్రీడాకారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వేడుక కేవలం టోర్నమెంట్ ముగింపు సభగానే కాకుండా, తెలంగాణ క్రీడా భవిష్యత్తుపై బీఆర్ఎస్ నాయకత్వం ఇచ్చిన స్పష్టమైన హామీగా నిలిచిందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికపై అవగాహన సమావేశం



**నెక్కొండ, ఏప్రిల్ 16అక్షర సవాల్:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నెక్కొండ మండల కేంద్రంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం,ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మండల స్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి,అభివృద్ధి ప్రాధాన్యతలను నిర్ణయించేందుకు ఈ సమావేశం దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పథకాలు,ఇప్పటివరకు సాధించిన పురోగతిని వివరించారు.అనంతరం ప్రజల సమస్యలపై చర్చించి,వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి నరసింహమూర్తి,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అనురాధ,మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,మండల తహసీల్దార్ రాజ్‌కుమార్,ఎంపీడీవో జి. దయాకర్,ఎస్సై మహేందర్,మండల సమాఖ్య అధ్యక్షురాలు రజిత,సీడీపీవో మధురిమ,వైద్య అధికారి తన్వీర్,నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ తదితరులతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,పంచాయతీ కార్యదర్శులు,మహిళా సమాఖ్య సభ్యులు,అంగన్వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది,ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపీ వేం నరేందర్ రెడ్డి కి

# అభినందనలు వెల్లువ



**న్యూ ఢిల్లీ, అక్షర సవాల్ :** న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవన్ లో రాజ్యసభ సభ్యుడిగా గురువారం ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డిని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గ్రేటర్ తో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు గురువారం అభినందనలు తెలియజేశారు. న్యూఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఎంపీ వేం నరేందర్ రెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాంనాయక్ ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, గ్రేటరవరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కడియం శ్రీహరి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, డాక్టర్ మురళి నాయక్, తదితరులు శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్చాలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# “ప్రతి పథకం వెనుక ఒక కుటుంబం”

### కలెక్టర్ మానవత్వ సందేశంతో ప్రజా పాలనకు కొత్త దిశ

### ట్రాఫిక్ భద్రత, బాలికల విద్యపై భావోద్వేగ పిలుపు

### ప్రజా సమస్యల పరిష్కారానికి గట్టి ఆదేశాలు

**గీసుగొండ, ఏప్రిల్ 16 । అక్షర సవాల్ ప్రతినిధి:** ప్రజా పాలనను కేవలం పరిపాలనా కార్యక్రమంగా కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను మార్చే బాధ్యతాయుత వేదికగా మలచాలనే స్పష్టమైన సందేశంతో “ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక” సమీక్ష సమావేశం హృదయాన్ని తాకింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద చేసిన ప్రసంగం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రతి పథకం వెనుక ఒక కుటుంబ జీవితం, ఒక ఆశ, ఒక భవిష్యత్తు దాగి ఉందని ఆమె పేర్కొన్నారు. “అర్హుడి గడప దాటని పథకం కాగితాలకే పరిమితం అవుతుంది” అంటూ పథకాలు నిజంగా ప్రజలకు చేరేలా కఠినంగా అమలు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణపై ఆమె సమగ్ర సమీక్ష చేస్తూ రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పెన్షన్ వంటి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాల్సిందేనని తేల్చి చెప్పారు. పారదర్శకత, వేగం, బాధ్యతతోనే పరిపాలనకు నిజమైన అర్థం వస్తుందని ఆమె స్పష్టం చేశారు. ట్రాఫిక్ భద్రత అంశంపై కలెక్టర్ చేసిన వ్యాఖ్యలు సమావేశంలో ప్రత్యేకంగా నిలిచాయి. “ప్రతి ప్రయాణం వెనుక ఇంట్లో ఎదురుచూసే ఒక కుటుంబం ఉంటుంది” అని చెబుతూ హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా పాటించాలని, యువత డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని గట్టి హెచ్చరిక చేశారు. రోడ్డు భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం సహించబడదని స్పష్టం చేశారు. బాలికల విద్యపై ఆమె ఇచ్చిన సందేశం సభను భావోద్వేగానికి గురిచేసింది. “ఒక ఆడపిల్ల చదువుకుంటే ఒక కుటుంబమే కాదు, సమాజ భవిష్యత్తే మారుతుంది” అని పేర్కొంటూ ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంపు, భద్రత, మరుగుదొడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను తక్షణమే మెరుగుపరచాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో డ్రాప్‌అవుట్ సమస్యను పూర్తిగా నిర్మూలించాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీపై కూడా ఆమె కఠినంగా స్పందించారు. ప్రతి దరఖాస్తు వెనుక ఒక కుటుంబ సమస్య దాగి ఉందని చెబుతూ, అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులను



ఆదేశించారు. పరిపాలనలో జాప్యం అనేది ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో గీసుగొండ ఎమ్మార్వో రియాజుద్దీన్, ఎంపీడీవో కృష్ణవేణి, ఎంపిఒ పాక శ్రీనివాస్, వ్యవసాయ అధికారి హరి ప్రసాద్ బాబు, గీసుగొండ సీఐ విశ్వేశ్వర్, ఎన్పీడీసీఎల్ ఏడీఈ రవి, సర్పంచ్ వీరుగోని రాజకుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, అంగన్వాడీ టీచర్లు, సెర్ప్ మహిళా సభ్యులు పాల్గొన్నారు. మొత్తంగా ఈ సమావేశం కేవలం సమీక్ష సమావేశంగా కాకుండా --- ప్రజల సమస్యలను కేంద్రంగా చేసుకుని మానవత్వం, బాధ్యత, పాలన మధ్య బలమైన అనుసంధానం చూపిన కీలక వేదికగా నిలిచింది.

## నీళ్లు అడిగి దగ్గరై... మహిళ మెడలో

# బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగుడు

### సూర్య తండాలో మధ్యాహ్నం చైన్‌స్నాచింగ్ కలకలం

### సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి వేటలో గీసుగొండ పోలీసులు

**గీసుగొండ, ఏప్రిల్ 16 అక్షర సవాల్:** గీసుగొండ మండలంలోని సూర్య తండా గ్రామంలో నీళ్లు అడిగినట్లు నటించి మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మధ్యాహ్నం వేళ జరిగిన ఈ చైన్‌స్నాచింగ్‌తో గ్రామస్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దుండగుడి కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, దుగ్గొండి మండలం మహమ్మదపురం గ్రామానికి చెందిన పాలడుగుల నరసమ్మ తన భర్త చంద్రయ్యతో కలిసి ఈ నెల 12న సూర్య తండాకు వచ్చారు. తమ కుమార్తె తాళ్లపల్లి కవిత, అల్లుడు రాజయ్య గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం వారు బంధువుల ఇంట్లోనే ఉండిపోయారు. ఈ నెల 15న మధ్యాహ్న సమయంలో కుమార్తె, అల్లుడు బయటకు వెళ్లగా, నరసమ్మ తన భర్తతో కలిసి ఇంటి బయట కూర్చొని ఉన్నారు. ఇదే సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఇంటి ముందు బండి ఆపి మంచినీళ్లు కావాలని అడిగాడు. బాధితురాలు స్పందించేలోపే ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును ఒక్కసారిగా లాక్కొని వేగంగా పరారయ్యాడు. ఘటనపై నరసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు



గీసుగొండ సీఐ తెలిపారు. నిందితుడిని గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తున్నామని, త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో సూర్య తండా గ్రామంలో ఆందోళన నెలకొంది. అపరిచితులు నీళ్లు, చిరునామా లేదా ఇతర కారణాలతో దగ్గరకు వచ్చినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మహిళలు ఒంటరిగా ఉన్న సమయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు.

## తెలంగాణ ఉద్యమకారులకు

# ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి...

**నల్లబెల్లి మండలం ఏప్రిల్ 16 : అక్షర సవాల్** ఈనెల 18న తలపెట్టిన చలో హైదరాబాద్ను విజయవంతం చేయండి మలిగితే తెలంగాణ ఉద్యమ పోరాటంలో అలుపెరుగని పూలు చేసిన తెలంగాణ ఉద్యమకారులు గుర్తింపు లేక ఆర్థిక అసమానతలతోఇబ్బందులు పడుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు గారెంటీలతో ఉద్యమకారులను ఇచ్చిన హామీ ఏమైంది ఒదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల సాంబారావు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. నల్లబె ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు తంగేళ్ల భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు ఈనెల 18న మరే కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్ తార్నాక హైదరాబాదులో ఉద్యమకారుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఉద్యమకారులందరూ ఇట్టి కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికతో పాటు తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులకు మొండిచేయి చూపిస్తే ఎలాంటి కార్యాచరణ రూపొందించాలో ఉద్యమకారుల సమక్షంలోనే నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. అండదండలతో గెలుస్తున్న ఉద్యమకాలకు మొండి చేయి చూపించడం తగదన్నారు ఇప్పటికైనా జార్ఖండ్ రాష్ట్ర తరహాలో ఉద్యమకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఎకరం భూమి చొప్పున ఇవ్వాలని అలాగే 250 చదరపు గజాల ఇంటి స్థలము ఇందిరమ్మ ఇల్లు 25 వేల రూపాయలు



తగ్గకుండా పెన్షన్ సౌకర్యము బస్సు రైలు ఉచిత ప్రయాణ పాసులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు ఆరోగ్య భీమా పథకం వర్తింపజేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు ఉద్యమకార్లపురం జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య టాప్ మండల ఉపాధ్యక్షులు పల్లికొండ రవి జేఏసీ మండల చైర్మన్ వేముల రాజు కేతన్ శ్రీనివాస్ ఎన్నమల్ల నరసయ్య పులి రమేష్ గౌడ్ మెరగుర్తి సమ్మయ్య మండల నాయకులు మామిళ్ళ పెద్ద ఐలయ్య కొత్తపేట ప్రభాకర్ తదితర ఉద్యమకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు

# గురుకుల విద్యార్థుల అద్భుత ప్రతిభ

## అత్యుత్తమ మార్కులతో మెరిసిన విద్యార్థులు..

**నెక్కొండ, ఏప్రిల్ 16 అక్షర సవాల్ :** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని తెలంగాణ గురుకుల పాఠశాలలో 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ప్రథమ,ద్వితీయ సంవత్సరాలలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ద్వితీయ సంవత్సరంలో పి. హేమశ్రీ (ఎంపీసీ) 993/1000 మార్కులు, ఆర్. దేవిక (బైపిసి) 989/1000 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. ప్రథమ సంవత్సరంలో బి. లక్ష్మీప్రసన్న, యు. తేజస్వి (ఎంపీసీ) ఇద్దరూ 467/470 మార్కులు సాధించగా, జి. లాస్య (బైపిసి) 436/440 మార్కులు సాధించి ప్రతిభ చాటుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి. శ్రీదేవి విద్యార్థులను,వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు నెక్కొండ ఎస్సై ఎం. మహేందర్ నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ గ్రామ సర్పంచ్ పెండ్యాల



హరిప్రసాద్, సీఐ శ్రీనివాస్,ఎస్సై ఎం.మహేందర్ పాల్గొని విద్యార్థులను,కళాశాల ప్రిన్సిపాల్‌ను, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

# రాజ్యసభలో నూతన స్వరం...

## ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డి

**హనుమకొండ, ఏప్రిల్ 16 అక్షర సవాల్:** తెలంగాణ రాష్ట్రం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి న్యూఢిల్లీలోని పార్లమెంట్ వేదికగా రాజ్యసభ సభ్యుడిగా ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కీలక సందర్భంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రత్యేకంగా పాల్గొని, వేం నరేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వేం నరేందర్ రెడ్డి పెద్దల సభలో అడుగుపెట్టడం హర్షణీయమని అన్నారు. వారి ప్రాతినిధ్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు, ముఖ్యంగా వరంగల్ ప్రాంత అభివృద్ధికి కేంద్ర స్థాయిలో మరింత బలం చేకూరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర మంత్రులు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు శాసనసభ్యులు (ఎమ్మెల్యేలు), ఎమ్మెల్సీలు, వరంగల్ మహానగర పాలక సంస్థ మేయర్, వివిధ జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యారు. అదేవిధంగా



తెలంగాణ రాష్ట్రం నుండి ఎన్నికైన మరో ప్రముఖ నాయకులు అభిషేక్ మను సింఘ్వీ కూడా రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి ఎన్నికైన మొత్తం 16 మంది సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రమాణ స్వీకారం చేయడం విశేషంగా నిలిచింది.

# దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలేటీ...

**న్యూఢిల్లీ, బెంగళూరు, ఏప్రిల్ 16:**రాజ్యాంగ 131వ సవరణ బిల్లు, 2026: దీని ప్రకారం లోక్‌సభ సభ్యుల సంఖ్య ప్రస్తుతమున్న 543 నుండి 850కి పెరుగుతుంది. ఇందులో రాష్ట్రాల నుండి 815 మంది, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 35 మంది సభ్యులు ఉంటారు.డీలిమిటేషన్ బిల్లు, 2026: జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల సరిహద్దులను మార్చడానికి, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వేషన్లను ఖరారు చేయడానికి ఒక శక్తివంతమైన 'డీలిమిటేషన్ కమిషన్'ను ఇది ఏర్పాటు చేస్తుంది. కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు, 2026: పెరిగిన సీట్లు, మహిళా రిజర్వేషన్లను కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు చేసేలా ఈ బిల్లు మార్పులు సూచిస్తుంది.ఈ ప్రతిపాదనలపై తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జనాభాను నియంత్రించి, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తమకు, ఈ జనాభా ఆధారిత సీట్ల పెంపు అన్యాయం చేస్తుందని అవి భావిస్తున్నాయి. ప్రధానంగా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్ దీనిని రాష్ట్ర ప్రయోజనాలపై దాడి అని అభివర్ణించగా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇది దేశ సమాఖ్య వ్యవస్థ సమతుల్యతను దెబ్బతీస్తుందని దేశ ప్రధానికి లేఖ రాశారు. జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరగడం వల్ల, భవిష్యత్తులో దేశ రాజకీయ నిర్ణయాధికారంలో దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కబడుతుందనేది ప్రధాన ఆందోళన. మాజీ కేంద్ర మంత్రి చిదంబరం గణాంకాలతో వివరిస్తూ, ప్రస్తుత నియోజకవర్గాల మార్పు వల్ల దక్షిణాది రాష్ట్రాల వాటా 24.3% నుండి 20.7%కి పడిపోతుందని హెచ్చరించారు. ఇది ఒక దురుద్దేశపూరిత కుట్ర అని ఆయన విమర్శించారు.

నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ప్రధాన రాష్ట్రాల్లో సీట్ల మార్పులు ఈ విధంగా ఉండే అవకాశం ఉంది: తమిళనాడు ప్రస్తుతం 39 లోక్‌సభ స్థానాలను కలిగి ఉంది. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 49 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 59 స్థానాలు లభిస్తాయి.



**కేరళ** ప్రస్తుతం 20 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 23 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల
వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 30 స్థానాలు లభిస్తాయి.

**ఆంధ్రప్రదేశ్:** ప్రస్తుతం రాష్ట్రంలో 25 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 33 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 37 స్థానాలు లభిస్తాయి.

**తెలంగాణ:**ప్రస్తుతం 17 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 24 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 25 స్థానాలు లభిస్తాయి.

**ఒడిశా:**ప్రస్తుతం 21 స్థానాలను కలిగి ఉంది. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 28 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 31 స్థానాలు లభిస్తాయి.

**కర్ణాటక:** ప్రస్తుతం 28 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 41 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 42 స్థానాలు లభిస్తాయి. అయితే ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం 80 స్థానాల ఉండగా, గణనీయంగా 140పైగా లోక్‌సభ స్థానాలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.

ప్రతిపక్షాల వాదన ప్రకారం, కేవలం జనాభా ఆధారంగా చూస్తే తమిళనాడు సీట్లు తగ్గవచ్చు. కానీ ప్రభుత్వం ప్రతిపాదించిన 'దామాషా పద్ధతి'లో అవి పెరిగినట్లు కనిపిస్తున్నా.. ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాది ప్రాబల్యం తగ్గుతుందనేది వారి అసలు పాయింట్. ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. 1971 జనాభా లెక్కల ఆధారంగా ఉన్న వ్యవస్థ ఇప్పుడు కాలం చెల్లిందని ప్రభుత్వం వాదిస్తోంది. ప్రతి ప్రాంతానికి, ప్రతి వర్గానికి మేలు జరిగేలా ఈ బిల్లులను రూపొందించామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. జనాభా అదుపులో ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు కూడా సీట్లు పెరుగుతాయని, కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు కావాలంటే డీలిమిటేషన్ ప్రక్రియ తప్పనిసరి అని, 15 ఏళ్ల పాటు ఈ రిజర్వేషన్లు కొనసాగుతాయని ప్రభుత్వం గుర్తు చేస్తోంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రజల సమస్యలను సభలో వినిపించడానికి సభ్యుల సంఖ్య పెరగడం ప్రజాస్వామ్యానికి అవసరమని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.సోనియా గాంధీ వంటి అగ్రనేతలు సైతం రాజకీయ ప్రాతినిధ్యంలో వచ్చే ఈ పెనుమార్పులు రాజ్యాంగ సూత్రాలను దెబ్బతీస్తాయని హెచ్చరిస్తున్నారు. కేవలం జనాభా ప్రాతిపదికన కాకుండా, అభివృద్ధిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. గురువారం నుండి జరగబోయే ఈ మూడు రోజుల సమావేశాలు కేవలం బిల్లుల ఆమోదానికే పరిమితం కాకుండా, ఉత్తర-దక్షిణ భారత రాష్ట్రాల మధ్య నెలకొన్న రాజకీయ, ఆర్థిక అసమానతలపై చర్చకు వేదిక కానున్నాయి. ప్రభుత్వం ఈ ఆందోళనలను ఎలా శాంతింపజేస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# మురుగు నీటికి ఫుల్ డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 16:**వ్యర్థ జలాల పునర్వినియోగం కోసం హైదరాబాద్ జలమండలి వినూత్న కార్యక్రమానికి రెడీ అయింది. గేటెడ్ కమ్యూనిటీల నుంచి శుద్ధి చేసిన మురుగునీటిని ఒక్కో ట్యాంకర్‌కు రూ.50-రూ.100 చెల్లించి సేకరించనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా 'ఎరుపు రంగు' ట్యాంకర్లను కేటాయించింది. సేకరించిన నీటిని నిర్మాణాలు, పరిశ్రమలు, పార్కుల నిర్వహణకు వాడడం ద్వారా తాగునీటిపై ఒత్తిడిని తగ్గించాలని జలమండలి అధికారులు భావిస్తున్నారు.సాధారణంగా ప్రజలు జలమండలి నుంచి నీటిని కొనుగోలు చేయడం మనకు తెలుసు. ఇప్పటికే హైదరాబాద్ నగరంలో వేసవి తాపం మట్నదలవుగా.. భూగర్భ జలాలు అడుగంటిపోవటంతో నీటికి డిమాండ్ పెరిగింది. భారీగా ట్యాంకర్లు బుక్ చేస్తున్నారు. కానీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. గేటెడ్ కమ్యూనిటీలలోని ప్రైవేట్ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని జలమండలి తిరిగి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఒక్కో ట్యాంకర్ నీటికి రూ.50 నుంచి రూ.100 వరకు చెల్లించేందుకు బోర్డు రెడీ అయింది.హైదరాబాద్‌లోని వివిధ గేటెడ్ కమ్యూనిటీలలో రోజుకు దాదాపు 200 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేస్తున్నారు. ఇందులో తక్కువ నీటిని మాత్రమే గార్డెనింగ్, ఫ్లషింగ్ కోసం వాడుతుండగా.. మెజారిటీ నీరు నాలాల ద్వారా కుంటలు, చెరువుల్లోకి వృథాగా కలిసిపోతోంది. ఈ వృథాను అరికట్టి ఆ నీటిని పునర్వినియోగంలోకి తీసుకురావడమే లక్ష్యంగా జలమండలి కీలక నిర్ణయం తీసుకుంది. శుద్ధి చేసిన ఈ గ్రే వాటర్ సేకరణ కోసం జలమండలి ప్రత్యేకంగా రెడ్ కలర్ ట్యాంకర్లను ప్రవేశపెట్టనుంది. తాగే నీటి సరఫరా కోసం ప్రస్తుతం బ్లూ రంగు ట్యాంకర్లు వాడుతున్నారు. శుద్ధి చేసిన మురుగునీటి కోసం ఎరుపు రంగు ట్యాంకర్లను కేటాయించారు. గేటెడ్ కమ్యూనిటీలు తమ వద్ద ఉన్న నీటిని విక్రయించడానికి జలమండలిని సంప్రదిస్తే.. ఖాళీ ట్యాంకర్ నేరుగా వారి వద్దకు పంపి నీటిని సేకరించనున్నారు.సేకరించిన నీటి నాణ్యతను పరీక్షించిన తర్వాత.. దానిని తాగేందుకు కాకుండా ఇతర అవసరాలైన భవన నిర్మాణాలు, లాండ్‌స్కేపింగ్, గోల్ఫ్ కోర్స్ నిర్వహణ, పారిశ్రామిక అవసరాల కోసం వినియోగిస్తారు. ప్రస్తుతం నగరంలో శుద్ధి చేసిన నీటిలో 2 శాతం కంటే తక్కువే వాడుతున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ఈ కొత్త వాటర్ బ్యాంక్ ద్వారా దీనిని 2000 ఎంఎల్డీలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టును పైలట్ ప్రాతిపదికన మూడు ట్యాంకర్లతో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. డిమాండ్‌ను బట్టి వీటి సంఖ్యను



పెంచనున్నట్లు వెల్లడించారు. ఢిల్లీకి చెందిన ఒక సంస్థ ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేస్తున్నట్లు వివరించారుప్రస్తుతం హైదరాబాద్ నగరంలో నీటి డిమాండ్ పెరిగిందన్నారు. గతేడాది మార్చిలో 2.1 లక్షల ట్యాంకర్ల వినియోగం ఉంటే.. ఈ ఏడాది ఆ సంఖ్య 2.24 లక్షలకు చేరుకుందన్నారు. ప్రతి రోజూ సరాసరి 7500 ట్యాంకర్లు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. డొమెస్టిక్ ట్యాంకర్ రూ.500, కమర్షియల్ అయితే రూ.850 చొప్పున వసూలు చేస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు.

# బెంబేలెత్తిన ఐటీ కారిడార్..

**గచ్చిబౌలిలో ఒక్క వాహనం బ్రేక్‌డౌన్**
**కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్**
**ఎండలో ఇబ్బందులు పడిన వాహనదారులు**
**ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు గంటల తరబడి శ్రమించిన పోలీసులు**

**హైదరాబాద్ సిటీ:** ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకీ తీవ్రమవుతోంది. ఇప్పటికే అత్యంత రద్దీగా ఉండే గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, నార్సింగి, హైటెక్ సిటీ మార్గాల్లో ఒక వాహనం బ్రేక్‌డౌన్ అయినా చాలు.. క్షణాల్లోనే కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. తాజాగా బుధవారం నార్సింగి, నానక్‌రామ్‌గూడ వైపు నుంచి గచ్చిబౌలికి వచ్చే మార్గంలో ఓ ఎస్‌యూవీ కారు కారు ఆకస్మికంగా రోడ్డుపై నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ఘటనతో ఓఆర్ఆర్ మీదుగా గచ్చిబౌలి వైపు వెళ్తున్న వేలాది మంది వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండుతున్న ఎండల్లో కార్లు, బైక్‌లపై ప్రయాణిస్తున్న వారు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. కొందరు ఉద్యోగులు ఆఫీసులకు ఆలస్యంగా చేరుకోగా, మరికొందరు ముఖ్యమైన సమావేశాలు కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు కిలోమీటరు పైగా బారులు తీరగా, ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి పోలీసులకు గంటన్నరకు పైగా సమయం పట్టింది.

**నిత్యకృత్యంగా మారిన బ్రేక్‌డౌన్‌లు..**

గచ్చిబౌలి, హైటెక్‌సిటీ ప్రాంతాలు నగరానికి ఐటీ హబ్‌గా మారిన తర్వాత ఇక్కడ వాహనాల సంఖ్య అమాంతం పెరిగింది. నగరం నలుమూలల నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు



ఐటీ కారిడార్‌కు వచ్చి వెళుతుంటారు. దీంతో ఇక్కడి రోడ్లపై వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి రోజు ఎక్కడో ఒక చోట వాహనాలు బ్రేక్‌డౌన్ కావడం ట్రాఫిక్‌జామ్‌కు దారి తీస్తోందని పోలీసులు పేర్కొంటున్నారు. ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి జంక్షన్, ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్) వైపు, మసీద్‌బండా, ఐకియా ఫ్లైఓవర్, హైటెక్‌సిటీ మెయిన్ రోడ్ వంటి ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఐటీ ఉద్యోగుల హైబ్రిడ్ వర్క్ కారణంగా మంగళ, బుధ, గురు వారాల్లో రద్దీ మరింత పెరుగుతోంది. ఒక్క గంటలోనే 10వేలకు పైగా సింగిల్ రైడర్ వెహికిల్స్ రోడ్డు మీదకు వస్తున్నాయని ఇటీవల మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన సర్వేలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా రద్దీ సమయాల్లో బ్రేక్‌డౌన్ అయిన వాహనాన్ని పక్కకు తీయడానికి ట్రాఫిక్ పోలీసులు గంటల తరబడి శ్రమించాల్సి వస్తోంది. మరోవైపు ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయడం పోలీసులకు మరో సవాల్‌గా మారింది. ఈ పరిస్థితులపై ఐటీ ఉద్యోగులు తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.రోజూ కార్యాలయాలకు చేరుకోవడానికి గంటల సమయం పడుతోందని, ట్రాఫిక్‌లోనే విలువైన సమయం వృథా అవుతోందని వాపోతున్నారు. వాహనాల తొలగింపుకు ఫాస్ట్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేయడం, ప్రత్యామ్నాయ మార్గాలు అభివృద్ధి చేయడం, ట్రాఫిక్ మానిటరింగ్‌ను మరింత బలోపేతం చేయడం అవసరమని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. లేకపోతే రాబోయే రోజుల్లో ఐటీ కారిడార్ ట్రాఫిక్ సమస్య మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# తెలంగాణ కుల సర్వే అధికారిక నివేదిక విడుదల

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర జనాభాలో బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (చీశీ జుర్వ) తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.

**కులాల వారీగా ప్రధాన వర్గాలు**

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 27.96 లక్షల మందితో (7.9 శాతం) షేక్ ముస్లింలు రెండో స్థానంలో, 26.39 లక్షల జనాభాతో (7.4 శాతం) ముదిరాజ్ సామాజిక వర్గం మూడో స్థానంలో ఉన్నాయి.

**ఓసీ వర్గాల్లో:** రెడ్డి సామాజిక వర్గం 4.8 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కోమటి (1.4 శాతం), కమ్మ (1.0 శాతం), బ్రాహ్మణ (0.9 శాతం), కాపు/నాయుడు (0.7 శాతం), వెలమ (0.4 శాతం) ఉన్నారు.

**బీసీ వర్గాల్లో:** షేక్ ముస్లింలు (7.9 శాతం) అత్యధిక జనాభాతో ముందుండగా, ముదిరాజ్ (7.4 శాతం), యాదవ (5.7 శాతం), గౌడ్ (4.6 శాతం), మున్నూరుకాపు (3.9 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచారు.

**ఎస్సీ వర్గాల్లో:** మాదిగ (10.3 శాతం) సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగి ఉండగా, మాల (4.1 శాతం), బేడా (0.5 శాతం), మాల సేల్ (0.5 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

**ఎస్టీ వర్గాల్లో:** లంబాడీలు 6.8 శాతం జనాభాతో అగ్రస్థానంలో నిలిచారు. కోయ (1.2 శాతం), గోండ్ (1.1 శాతం), ఎరుకుల (0.5 శాతం) వారి తర్వాత ఉన్నారు. ఈ సర్వే ద్వారా వెల్లడైన గణంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూపకల్పన, రాజకీయ సమీకరణాల్లో కీలక పాత్ర పోషించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# త్వరలో సంస్థాగత పోస్టులు..

- మొదటి పేజీ తరువాయి

అక్కడక్కడా వినిపిస్తున్న అసంతృప్తి స్వరాలపై కూడా మీనాక్షి నటరాజన్ ఈ సందర్భంగా ఆరా తీశారు. కొందరు సీనియర్ నేతలు ప్రభుత్వ నిర్ణయాలపై బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు, సమన్వయ లోపంపై చర్చించారు. అందరినీ కలుపుకుని వెళ్లాలని, జిల్లాల వారీగా పార్టీ నేతలతో నిరంతరం టచ్‌లో ఉండాలని టీపీసీసీ అధ్యక్షుడికి సీఎం సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో పార్టీ కేడర్ క్రియాశీలకంగా వ్యవహరించాలని ఈ సమావేశం నిర్ణయించింది.దీనితో పాటు, రాబోయే గ్రేటర్ ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసే దిశగా వ్యూహరచన చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల అమలు తీరును, లబ్ధిదారుల అభిప్రాయాలను పార్టీ యంత్రాంగం సేకరించాలని చర్చించారు. పార్టీ ఇన్ఛార్జ్ మీనాక్షి నటరాజన్ కేడర్ నుంచి అందుతున్న ఫీడ్‌బ్యాక్‌ను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య గ్యాప్ లేకుండా చూసేందుకు క్రమం తప్పకుండా ఇటువంటి సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఈ భేటీలో తీర్మానించారు.రేవంత్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ ముక్కోణపు భేటీ తెలంగాణ కాంగ్రెస్‌లో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. నామినేటెడ్ పదవుల భర్తీతో పాటు, పార్టీలోని అంతర్గత విభేదాలకు చెక్ పెట్టి.. రాబోయే ఎన్నికలకు క్యాడర్‌ను సమరోత్సాహంతో సిద్ధం చేయడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. ఇప్పటికే లిస్ట్ సిద్ధమైందని, ఏ క్షణమైనా అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని గాంధీ భవన్ వర్గాలు ధృవీకరిస్తున్నాయి.

## మహిళా బిల్లుతో దేశ రాజకీయాల దిశ, దశ మారతాయి

- మొదటి పేజీ తరువాయి

న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్... రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026, డీలిమిటేషన్ బిల్లు, 2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026లను సభ ముందు ఉంచారు. అయితే, ఈ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో విపక్షాలు మూజువాణి ఓటింగ్‌ను అంగీకరించలేదు. ఓట్ల విభజన (డివిజన్)కు పట్టుబట్టడంతో సభలో ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది. బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు పోలైనట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా లోక్‌సభలో మూజువాణి ఓటు ద్వారానే తీర్మానాలు ఆమోదిస్తారు. కానీ, ఫలితంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు సభ్యుల కోరిక మేరకు డివిజన్ నిర్వహిస్తారు. ఆటోమేటిక్ ఓట్ రికార్డర్ వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ తర్వాత ఓటు స్లిప్పుల ద్వారా జరిగిన ఓటింగ్‌లో మొత్తం 333 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, పార్టీలు ఈ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని విజ్ఞప్తి చేశారు. వికసిత భారత్ ఏ2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో మహిళా రిజర్వేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. గతంలో ఈ బిల్లును వ్యతిరేకించిన వారికి మహిళా ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారని ఆయన వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్ తో కలిసి రేవంత్ పనిచేస్తారా


- మొదటి పేజీ తరువాయి

నమ్మకం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్ర హక్కుల కోసం తాము ఇతర పక్షాలతో కలిసి పోరాడుతామని చెబుతూనే, రేవంత్ రెడ్డిని బీజేపీ ప్రతినిధి గా ముద్ర వేయడం ద్వారా కాంగ్రెస్‌తో కలిసి నడిచే ప్రసక్తే లేదని పరోక్షంగా స్పష్టం చేశారు.మరోవైపు, కాంగ్రెస్ అధిష్టానం కూడా డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది రాష్ట్రాల ఆవేదనను పరిగణనలోకి తీసుకుంటోంది. అయితే, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రధాన ప్రత్యర్థి కావడంతో, వారితో చేతులు కలిపితే తమ రాజకీయ ఉనికి దెబ్బతింటుందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. అందుకే, ఇద్దరి లక్ష్యం దక్షిణాది ప్రయోజనాలు అయినప్పటికీ, ఆ క్రెడిట్ ఎవరికి దక్కాలనే విషయంలో నువ్వా-నేనా అన్నట్లుగా పోటీ పడుతున్నారు. ఇది కేవలం సిద్ధాంతాల పోరాటం కంటే పవర్ పాలిటిక్స్ గానే ఎక్కువగా కనిపిస్తోంది.డీలిమిటేషన్ అంశం తెలంగాణలో విచిత్రమైన పరిస్థితిని సృష్టించింది. ఒకే సమస్యపై అధికార, ప్రతిపక్షాలు ఒకే మాట మీద ఉన్నా.. గల్లీలో ఉన్న వైరం వల్ల ఢిల్లీలో గళం కలపలేకపోతున్నాయి. ఒకవేళ కేంద్రం జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచితే, ఈ ఇద్దరు నేతలు విడివిడిగానే నిరసన గళాలు వినిపిస్తారా లేక రాష్ట్ర ప్రయోజనాల కోసం అనివార్యంగా ఒకే వేదికపైకి వస్తారా అన్నది వేచి చూడాలి. గతంలో తమిళనాడులో స్టాలిన్ నిర్వహించిన సమావేశానికి ఇద్దరు నేతలు హాజరయ్యారు. ప్రస్తుతానికి మాత్రం ఈ కామన్ పాలసీ కేవలం ప్రకటనలకే పరిమితం కానుంది.

# బోయిన్ పల్లి లో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్


**సికింద్రాబాద్:**ప్రజలకు శాంతిభద్రతల పట్ల భరోసా కల్పించడమే లక్ష్యంగా నిర్బంధ తనిఖీలు నిర్వహించినట్లు మల్కాజిగిరి జోన్ డిసిపి శ్రీధర్ తెలిపారు. బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అలీ కాంప్లెక్స్ తో పాటు పరిసర ప్రాంతాలలో 300 మంది పోలీసు సిబ్బందితో నిర్బంధ తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ తనిఖీలలో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలతో పాటు ఓ డైరీ ఫామ్ లో అక్రమంగా నిల్వ ఉంచిన 10 లీటర్ల ఆక్సిటోసిన్ రసాయనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఓ ఇంట్లో హుక్కా తయారీ యంత్రంతో పాటు నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బోయిన్ పల్లి ప్రాంతంలో గంజాయి సరఫరా పై కూడా ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు గంజాయి సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు భరోసా కల్పించడమే తమ లక్ష్యమని పోలీసులకు అన్నివేళలా ప్రజలు సహకరించాల్సిన బాధ్యత ఉంటుందని అన్నారు.

# కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే..



ఈ రోజుల్లో కాలేయ, పేగు సంబంధిత సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. అందువల్ల, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. సరైన ఆహారం తీసుకోకపోతే ఈ అవయవాలకు హాని కలుగుతుంది. ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ప్రధానంగా సరైన ఆహారం తీసుకోకపోవడం, క్రమరహిత దినచర్యలు, పెరిగిన ఒత్తిడి కారణంగా కాలేయం, పేగుల సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. జంక్ ఫుడ్, వేయించిన ఆహారాలు, నీటి కొరత జీర్ణవ్యవస్థను బలహీనపరుస్తాయి.. ఇది కాలేయంపై కూడా ప్రభావం చూపుతుంది. కాలేయం, పేగులు (లివర్, గట్ హెల్త్) సరిగ్గా పనిచేయనప్పుడు, తరచుగా కడుపునొప్పి, గ్యాస్, మలబద్ధకం లేదా విరేచనాలు, అలసట, ఆకలి లేకపోవడం, చర్మం పసుపు రంగులోకి మారడం, నోటిలో చెడు రుచి వంటి వివిధ లక్షణాలు కనిపిస్తాయి. అదనంగా, కడుపులో బరువుగా అనిపించడం, ఉబ్బరం, నీరసం కూడా సాధారణ లక్షణాలు. ఈ సంకేతాలను నిర్లక్ష్యం చేయడం భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలకు దారితీయవచ్చు. అందువల్ల, బలమైన జీర్ణవ్యవస్థను కాపాడుకోవడానికి మీ ఆహారం, జీవనశైలిపై సకాలంలో శ్రద్ధ పెట్టడం ముఖ్యం. ఆర్ఎంఎల్ హాస్పిటల్ లోని వైద్య విభాగం డైరెక్టర్ అయిన ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి.. పాలకూర, మెంతులు, ఆవాలు వంటి ఆకుకూరలలో పీచుపదార్థం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని వివరించారు. ఇవి శరీరం నుండి విషపదార్థాలను తొలగించడానికి, కాలేయాన్ని శుద్ధి చేయడానికి, ప్రేగులను శుభ్రపరచడానికి సహాయపడతాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి. అంతేకాకుండా, ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేసి, శరీరాన్ని వ్యాధుల నుండి కాపాడతాయి. పెరుగులోని మంచి బ్యాక్టీరియా పేగు మైక్రోబయోమ్‌ను సమతుల్యం చేయడానికి సహాయపడతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. గ్యాస్ మరియు మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. ఇంకా కాలేయంపై అనవసరమైన ఒత్తిడిని నివారిస్తుంది. క్రమం తప్పకుండా పెరుగు తీసుకోవడం వల్ల కడుపు చల్లగా ఉండి, జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. ఇది పోషకాల శోషణను కూడా మెరుగుపరుస్తుంది.

# ఈ కాఫీ తాగితే వెయిట్ లాస్?



ప్రస్తుతం సోషల్ మీడియాలో హెల్త్ ట్రెండ్స్ గురించి వెతికే వారికి ఎక్కువగా వినిపిస్తున్న పేరు 'బుల్లెట్ కాఫీ'. బరువు తగ్గాలనుకునే వారు, కీటో డైట్ అనుసరించేవారు దీనిని ఒక మ్యాజిక్ డ్రింక్ లా భావిస్తున్నారు. సాధారణంగా కాఫీ అంటే పాలు, చక్కెరతో కూడుకున్నది. కానీ ఈ బుల్లెట్ కాఫీ తయారీ, దాని పనితీరు పూర్తిగా భిన్నం. అసలు ఈ కాఫీ వెనుక ఉన్న సైన్స్ ఏంటి? ఇది నిజంగానే కొవ్వును కరిగిస్తుందా? కేవలం సెలబ్రిటీలకే పరిమితం కాకుండా సామాన్యులకు కూడా చేరువైంది ఈ కాఫీ ట్రెండ్. ఇది అందరికీ ఒకే రకమైన ఫలితాలను ఇస్తుందా అంటే లేదనే చెప్పాలి. ఒకవైపు బరువు తగ్గడానికి సహాయపడుతుందని ప్రచారం జరుగుతుంటే, మరోవైపు దీనివల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయేమో అన్న అనుమానాలు కూడా వ్యూయర్లలో వ్యక్తమవుతున్నాయి. ఇదంతా బుల్లెట్ కాఫీ గురించే. సాధారణ కాఫీకి భిన్నంగా దీనిని బ్లాక్ కాఫీలో నెయ్యి లేదా వెన్న కలిపి తయారు చేస్తారు. ఇందులో పాలు లేదా చక్కెర అస్సలు వాడరు. ఈ పద్ధతిలో తయారైన కాఫీని తాగడం వల్ల శరీరానికి అధిక మొత్తంలో ఆరోగ్యకరమైన కొవ్వులు అందుతాయి. ఇవి శరీరంలో ఇన్సులిన్ స్థాయిలను పెంచకుండానే శక్తిని అందిస్తాయి. బుల్లెట్ కాఫీ తాగడం వల్ల రెండు ప్రధాన ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు వివరిస్తున్నారు. ఇందులో ఉండే ఫ్యాట్స్ కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తాయి. దీనివల్ల మధ్య మధ్యలో చిరుతిళ్లు తినాలనే కోరిక తగ్గుతుంది. ఉదయాన్నే ఈ కాఫీ తాగడం వల్ల మధ్యాహ్నం వరకు ఆకలి వేయదు, ఫలితంగా ఇడ్లీ, దోశ వంటి కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే అల్పాహారం నుండి వచ్చే కేలరీలను మనం తగ్గించుకోవచ్చు. బుల్లెట్ కాఫీ అందరికీ సరిపడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా రక్తంలో కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారు దీనికి దూరంగా ఉండటం మంచిది. ఇందులోని అధిక కొవ్వు పదార్థాలు కొలెస్ట్రాల్ స్థాయిలను మరింత పెంచే అవకాశం ఉంది. కాబట్టి, ఏదైనా కొత్త ఆహారపు అలవాటును మొదలుపెట్టే ముందు మీ శరీరతత్వాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. కేవలం బుల్లెట్ కాఫీ తాగడం వల్లే బరువు తగ్గిపోతామని అనుకోవడం పొరపాటు. ఉదయం ఈ కాఫీ తాగి, సాయంత్రం బజ్జీలు, సమోసాలు తింటే ఎటువంటి ఫలితం ఉండదు. సరైన వ్యాయామం, ప్రోటీన్లు మరియు కూరగాయలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకుంటూ, ఆకలిని అదుపు చేసుకోవడానికి మాత్రమే దీనిని ఒక సాధనంగా వాడుకోవాలి. ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు దీనిని పాటిస్తేనే ఆశించిన ఫలితాలు అందుతాయి.

# ఆయాసం ఏ వ్యాధులను సూచిస్తుంది..? ఈ లక్షణాలను లైట్ తీసుకోవద్దు..



కొంత సేపు నడిచినా.. మెట్లు ఎక్కినా.. ఆయాసం అనేది కామన్.. కానీ.. కొంత తరచుగా ఆయాసపడటాన్ని అనుభవిస్తుంటారు.. దీనిని నిర్లక్ష్యం చేయకూడదంటున్నారు ఆరోగ్య నిపుణులు.. తరచుగా ఆయాసం అనేది.. అనేక తీవ్రమైన అనారోగ్యాలకు సంకేతం కావచ్చని పేర్కొంటున్నారు. చాలా మంది తరచుగా ఆయాసం గురించి ఫిర్యాదు చేస్తుంటారు. దీనిని ఎప్పుడూ.. నిర్లక్ష్యం చేయకూడదు.. ఎందుకంటే ఇది అంతర్గత సమస్యకు సంకేతం కావచ్చు. ఆయాసానికి అధిక శ్రమ, శారీరక బలహీనత, ఊబకాయం, ఒత్తిడి లేదా ఆందోళన వంటి అనేక సాధారణ కారణాలు ఉన్నాయి. వాతావరణ మార్పులు, కాలుష్యం, దుమ్ము లేదా అలర్జీలు కూడా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులకు దోహదం చేస్తాయి. కొన్నిసార్లు, ఎక్కువసేపు కూర్చోవడం లేదా వ్యాయామం చేయకపోవడం వల్ల శరీర శక్తి తగ్గి, తేలికపాటి పనులు చేసినా కూడా ఆయాసం వస్తుంది. సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం.. ధూమపానం వంటి అలవాట్లు కూడా ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. ఈ సమస్య తరచుగా వస్తుంటే లేదా ఎలాంటి శ్రమ లేకుండా కూడా ఇలా అనిపిస్తే, దానిని తేలికగా తీసుకోకూడదు. లేడీ హార్డింగ్ హాస్పిటల్‌లోని వైద్య విభాగం డైరెక్టర్ ? హెచ్ఓడి అయిన డాక్టర్ ఎల్.హెచ్. ఘోటేకర్.. తరచుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది అనేక తీవ్రమైన అనారోగ్యాలకు సంకేతం కావచ్చని వివరిస్తున్నారు. ఈ సమస్య ఆస్తమా, బ్రాంకైటిస్ లేదా ఇతర ఊపిరితిత్తుల వ్యాధులను సూచించవచ్చు. గుండె వైఫల్యం లేదా గుండెలో అడ్డంకులు వంటి గుండె సమస్యలు కూడా శ్వాస సమస్యలకు కారణం కావచ్చు. రక్తహీనత శరీరంలో ఆక్సిజన్ కొరతకు కారణమవుతుంది.. దీనివల్ల ఆయాసం వస్తుంది. కొన్ని సందర్భాల్లో, థైరాయిడ్ అసమతుల్యతలు లేదా ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు కూడా దీనికి కారణం కావచ్చు. ఆయాసంతో పాటు ఛాతీ నొప్పి, తల తిరగడం లేదా అలసట వంటి లక్షణాలు ఉంటే, వెంటనే వైద్యుడిని సంప్రదించడం ముఖ్యం.



# చెరకు రసం తాగితే లెక్కలేనన్ని ప్రయోజనాలు

వేసవి కాలంలో శరీరాన్ని ఉత్తేజపరిచి, తక్షణ శక్తిని అందించడానికి చెరుకు రసం ఒక అద్భుతమైన, తక్కువ ఖర్చుతో కూడిన పానీయం. పండ్ల రసాలతో పోలిస్తే ఇది సామాన్యులకు సైతం అందుబాటులో ఉంటుంది. చెరుకు రసంలో అధిక శాతం నీరు ఉండటం వల్ల వేసవిలో శరీరానికి అవసరమైన తేమను అందిస్తుంది. వేసవి కాలంలో శరీరాన్ని ఉత్తేజపరిచి, తక్షణ శక్తిని అందించడంలో చెరుకు రసం ఎంతో ప్రయోజనకరమైన పానీయం. ఆయుర్వేద నిపుణుల ప్రకారం.. చెరుకు రసంలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. ఇతర పండ్ల రసాలతో పోలిస్తే దీని ధర తక్కువగా ఉండటంతో, సామాన్యులు సైతం సులువుగా కొనుగోలు చేసి తాగగలుగుతారు. పండ్లు రసం గ్లాసు 70-80 రూపాయలు అవుతుంటే, చెరుకు రసం 20 రూపాయలకే లభిస్తుంది. చెరుకు రసంలో అధిక భాగం నీరే ఉంటుంది.. ఇది వేసవిలో శరీరానికి అవసరమైన హైడ్రేషన్‌ను అందిస్తుంది. ముఖ్యంగా, వేసవిలో శరీరానికి లవణాలు అధికంగా అవసరం. 100 గ్రాముల చెరుకు రసంలో 60 మి.గ్రా సోడియం ఉంటుంది. ఒక పావు లీటర్ (250 మి.లీ) చెరుకు రసం తాగడం వల్ల రోజుకు అవసరమైన సోడియంలో దాదాపు 50% లభిస్తుంది. ఇందులో ఉండే రెడీమేడ్ షుగర్స్ కేవలం 15-20 నిమిషాల్లోనే రక్తంలో కలిసి తక్షణ శక్తిని ఇస్తాయి. ఇది తేలికగా జీర్ణమై, త్వరగా శరీరంలోకి శోషించబడే స్వభావాన్ని కలిగి ఉంటుంది. 100 గ్రాముల చెరుకు రసం నుండి 39 కేలరీలు లభిస్తాయి. 200 మిల్లీలీటర్ల గ్లాసు తాగడం వల్ల ఒక కాఫీ కప్పు నుండి లభించే శక్తి (72-75 కేలరీలు)కి సమానమైన శక్తిని పొందుతాం. కొంతమంది తీపి ఎక్కువగా ఉండడం వల్ల బరువు పెరుగుతామేమోనని చెరుకు రసం తాగడానికి సంకోచిస్తారు. కానీ ఈ అపోహను విడనాడాలి. డయాబెటిస్ ఉన్నవారు రసంగా కాకుండా చెరుకు ముక్కలను తినవచ్చు. రసం తాగాలనిపిస్తే, అప్పుడప్పుడు చిన్న కాఫీ కప్పు అంత పరిమాణంలో తీసుకోవచ్చు.. ఎందుకంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిలను త్వరగా పెంచుతుంది. డయాబెటిస్ లేనివారు ఎవరైనా నిస్సంకోచంగా చెరుకు రసం తాగవచ్చు. చెరుకు రసం తాగడానికి ఉత్తమ సమయం సాయంత్రం 5 నుండి 5:30 గంటల మధ్య.. మధ్యాహ్న భోజనం తర్వాత నీరు తాగడం పూర్తయిన తర్వాత, ఈ సమయంలో 200-300 మిల్లీలీటర్ల చెరుకు రసం తీసుకోవడం మంచిది. సుమారు 100 కేలరీలు మాత్రమే లభించినప్పటికీ, ఇది తక్షణమే రక్తంలో శక్తిని నింపుతుంది. సాల్ట్స్, విటమిన్లు, మినరల్స్, మైక్రో న్యూట్రియంట్స్ పుష్కలంగా అంది.. శరీరంలోని ప్రతి కణానికి శక్తినిస్తుంది. వేసవిలో వచ్చే అలసటను తగ్గించడానికి ఇది చాలా సహాయపడుతుంది. సాయంత్రం చెరుకు రసం తాగిన గంట తర్వాత మంచి ఆకలి పుడుతుంది.. అప్పుడు రాత్రి 7 గంటల లోపు పండ్లు మాత్రమే ఆహారంగా తీసుకోవడం మంచిది. పాఠశాల నుండి వచ్చిన పిల్లలకు కూడా తక్షణ శక్తి కోసం చెరుకు రసం ఇవ్వవచ్చు.



## ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ 'డ్రాగన్'పై పెరుగుతున్న హైప్


పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న డ్రాగన్ సినిమా రోజురోజుకు వార్తల్లో నిలుస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ , ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే సినీ వర్గాల్లో భారీ క్రేజ్‌ను సంపాదించింది. 'ఆర్‌ఆర్‌ఆర్', 'దేవర' వంటి వరుస విజయాల తర్వాత ఎన్టీఆర్ నటిస్తున్న సినిమా కావడం, 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించడం ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను మరింత పెంచుతోంది. అయితే, గత కొన్ని రోజులుగా ఈ సినిమాకు సంబంధించి షూటింగ్, నటీనటుల ఎంపికపై సోషల్ మీడియాలో అనేక రూమర్స్ వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో హీరోతో సమానంగా పవర్‌ఫుల్ విలన్ పాత్ర ఉంటుందని ఇప్పటికే టాక్. తొలుత మలయాళ స్టార్ టోవినో థామస్ ను నెగటివ్ రోల్ కోసం సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. కానీ డేట్స్ సమస్యల కారణంగా ఆయన ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం. ఇప్పుడు ఈ కీలక పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ షాహిద్ కపూర్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఎన్టీఆర్‌కు ధీటుగా నిలిచే విలన్‌గా ఆయనను ఎంపిక చేయాలని మేకర్స్ భావిస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే చర్చలు జరిగాయని, త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని టాక్ నడుస్తోంది. ఇక షూటింగ్ ఆగిపోయిందంటూ వచ్చిన వార్తలను చిత్ర బృందం ఖండించింది. ఎన్టీఆర్ లుక్ విషయంలో డైరెక్టర్‌తో విభేదాలు వచ్చాయని ప్రచారం జరిగినా, అందులో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేసింది. ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో భారీ యాక్షన్ సన్నివేశాల కోసం ప్రతి షెడ్యూల్ మధ్య గ్యాప్ తీసుకోవడం సాధారణమేనని, ప్రస్తుతం షూటింగ్ ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగుతోందని తెలిపింది. ఈ సినిమాలో ఎన్టీఆర్ ఇప్పటివరకు చూడని రగ్గడ్, ఊర మాస్ లుక్‌లో కనిపించనున్నారని సమాచారం. ఇప్పటికే లీక్ అయిన కొన్ని ఫొటోలు అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచాయి. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్ లేదా టైటిల్ టీజర్ విడుదల చేసే అవకాశముందని తెలుస్తోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రుక్మిణి వసంత్ నటిస్తుండగా, బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. సంగీతాన్ని రవి బస్రూర్ అందిస్తున్నారు. ఈ సినిమా 2026 చివరిలో లేదా 2027 ప్రారంభంలో ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యే అవకాశం ఉంది.

## కాశీ అనుభవాలపై నటుడు ఆర్య సంచలన వ్యాఖ్యలు

### సాధువుల వేషంలో క్రిమినల్స్ ఉన్నారంటూ కామెంట్



తమిళ్‌తో పాటు తెలుగులోనూ హీరోగా, విలన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు ఆర్య తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. త్వరలో విడుదల కానున్న తన కొత్త చిత్రం 'మిస్టర్ ఎక్స్' ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా ప్రారంభమయ్యాయి. తన కెరీర్ ప్రారంభంలో చేసిన నేనే దేవుడ్ని సినిమా షూటింగ్ సందర్భంగా ఎదురైన అనుభవాలను ఆర్య గుర్తు చేసుకున్నారు. ఈ సినిమా కోసం వారణాసి (కాశీ)లో కొంతకాలం షూటింగ్ జరిపామని, అక్కడ నిజమైన సాధువులతో పాటు నకిలీ వ్యక్తులు కూడా ఉన్నారని తెలిపారు. ఆర్య మాట్లాడుతూ.. కాశీలో ఉన్న సాధువుల్లో చాలా మంది నిజాయితీ గలవాళ్లే. కానీ కొంతమంది మాత్రం సాధువుల వేషంలో క్రిమినల్స్‌గా ఉంటారు. వాళ్లకు ఎలాంటి గుర్తింపు పత్రాలు ఉండవు. పేరు అడిగినా 'స్వామి' అని మాత్రమే చెబుతారు. కొంతకాలం అక్కడ దాక్కొని తర్వాత వెళ్లిపోతారు" అని చెప్పారు అంతేకాకుండా కుంభమేళా సందర్భంగా కూడా ఇలాంటి సంఘటనలు జరిగే అవకాశముందని ఆర్య వెల్లడించారు. "మేము కుంభమేళా షూటింగ్‌కు వెళ్లినప్పుడు పోలీసులు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొంతమంది సాధువుల వేషంలో ఆయుధాలు కూడా కలిగి ఉంటారని చెప్పారు అని ఆయన పేర్కొన్నారు. ఆర్య చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొంతమంది ఆయన మాటలకు మద్దతు తెలుపుతూ, వాస్తవ పరిస్థితులను వెల్లడించారని అంటుండగా... మరికొందరు మాత్రం ఇలాంటి వ్యాఖ్యలు మతపరమైన భావోద్వేగాలను దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శిస్తున్నారు.ఏదేమైనా, ఒక ప్రముఖ నటుడు ఇలాంటి విషయాలపై బహిరంగంగా మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది. ఇది నిజంగా పరిస్థితులని ఉద్దేశించి చెప్పడమా ? లేక అతిశయోక్తి వ్యాఖ్యలా? అనే దానిపై ప్రస్తుతం నెటిజన్ల మధ్య తీవ్ర చర్చ కొనసాగుతోంది.



## ఎస్క్వైర్ ఇండియా కవర్ పేజ్‌పై రామ్ చరణ్ మెరుపులు.. గ్లోబల్ స్థాయిలో అరుదైన గుర్తింపు!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ మరోసారి అంతర్జాతీయ వేదికపై తన ముద్ర వేసుకున్నారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఎస్క్వైర్ ఇండియా ఏప్రిల్ ఎడిషన్ కవర్ పేజీపై ఆయన దర్శనమిచ్చారు. దుబాయ్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన ఈ ఫోటోషూట్‌లో రామ్ చరణ్ స్టైలిష్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే గ్లోబల్ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న చరణ్... ఈ కవర్ ఫీచర్‌తో మరో మైలురాయిని అందుకున్నారు. గతంలో జూనియర్ ఎన్టీఆర్ కూడా ఇదే మ్యాగజైన్ కవర్‌పై కనిపించగా, ఇప్పుడు ఆ ఘనత సాధించిన రెండో తెలుగు హీరోగా రామ్ చరణ్ నిలిచారు. దీంతో మెగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫోటోషూట్‌లో చరణ్ స్టైలింగ్, ప్రెజెన్స్ అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోకుండా ఉండటంతో, ఆయన గ్లోబల్ అప్పీల్ మరింత బలపడిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అభిమానులు ఆయన పూర్తి ఇంటర్వ్యూకోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయ్యింది. ఒక పాట మినహా మిగిలిన భాగాలన్నీ కంప్లీట్ కాగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు యూట్యూబ్‌లో భారీ వ్యూస్ సాధించి మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. బుచ్చిబాబు స్టైల్ ఎమోషన్స్, చరణ్ మేకోవర్ కలిసి ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఒకవైపు అంతర్జాతీయ మ్యాగజైన్ కవర్‌పై మెరుస్తూ, మరోవైపు క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్న రామ్ చరణ్... ఈ ఏప్రిల్‌లో అభిమానులకు డబుల్ ట్రీట్ అందిస్తున్నాడని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

## గోపీచంద్ 'భరతవర్ష' గ్లింప్స్ విడుదల..

### యోధుడిగా అదిరిపోయే లుక్, దేశభక్తి కథపై అంచనాలు పీక్స్!

యాక్షన్ హీరో గోపీచంద్ మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వరుస ఫ్లాప్స్ తర్వాత సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన ఈసారి పూర్తిగా భిన్నమైన కథతో 'భరతవర్ష' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో కొత్త సినిమాను ప్రకటించారు. టైటిల్ గ్లింప్స్ విడుదలయ్యాక సినిమా పై ఒక్కసారిగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా విడుదలైన గ్లింప్స్ వీడియోలో గోపీచంద్ యోధుడిగా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటూ యుద్ధరంగంలో విరుచుకుపడే సన్నివేశాలు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, యాక్షన్ ఎలిమెంట్స్ అన్నీ కలిసి సినిమా గ్రాండ్‌గా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నాయి. 'భరతవర్ష' అనే టైటిల్‌కు కూడా ప్రత్యేకమైన అర్థం ఉంది. పురాణాల ప్రకారం భరతవర్షం అంటే హిమాలయాల నుంచి సముద్రం వరకు విస్తరించిన అఖండ భారతదేశాన్ని సూచిస్తుంది. చక్రవర్తి భరతుడి పేరుమీదుగా ఈ పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతుంది. ఈ నేపథ్యంలో సినిమా దేశభక్తి, చరిత్ర, మైథాలజీ అంశాలను మేళవించి రూపొందుతున్నట్టు తెలుస్తోంది. ఇండిపెండెన్స్‌కు ముందు జరిగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. కథలో మైథాలజీ టచ్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ కలయికతో సినిమా మరింత ఆసక్తికరంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందట. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారని, మేకర్స్ ఎక్కడా రాజీ పడటం లేదని తెలుస్తోంది. గోపీచంద్ కెరీర్‌లో ఇది ఒక టర్నింగ్ పాయింట్ మూవీ అవుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటివరకు వచ్చిన గ్లింప్స్, టైటిల్ ప్రభావం చూస్తే 'భరతవర్ష'తో ఆయన బలమైన కంబ్యాక్ ఇవ్వడం ఖాయం అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.





## ఎన్నాళ్లీ సింగిల్ బతుకు? క్లారిటీ ఇచ్చిన రామ్

తెలుగు హీరోల్లో బ్యాచిలర్స్ అనుకున్న వాళ్లకు కూడా ఒక్కొక్కళ్లకు పెళ్లిళ్లు అయిపోతున్నాయి. ప్రస్తుతం చూసుకుంటే ప్రభాస్, రామ్, సాయిధరమ్ తేజ్ లాంటి కొందరు మాత్రమే ఇంకా సింగిల్‌గా ఉన్నారు. వీళ్లలో ప్రభాస్ చేసుకుంటాడా అంటే సందేహమే. సాయిధరమ్ తేజ్ మాత్రం ఈ ఏడాదో వచ్చే ఏడాదో శుభవార్త చెప్పేలా ఉన్నాడు. రామ్ మాత్రం ఇప్పుడు తన సింగిల్ స్టేటస్, పెళ్లి వాటిపై పరోక్షంగా క్లారిటీ ఇచ్చేశాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ విషయమై స్పందించాడు. 'చిన్నప్పటి నుంచి నేను ఒంటరిగా ఉండటం అలవాటుపడ్డా. ఖాళీ టైంని ఒక్కడినే ఆస్వాదిస్తుంటా. స్నేహితులు, మిగతా వాళ్లతో గడపటం ఇష్టమే ?కానీ నాకోసం నేను టైమ్ కేటాయించుకోవడంలో ఆనందముంది. ఆ ఏకాంతం నాకు ఎంతో రిలాక్స్‌గా అనిపిస్తుంది. ఎవరైనా నా జీవితంలోకి వస్తే వాళ్లతో సమయం గడిపేందుకు సిద్ధమే. రాకపోయినా ఒంటరిగా సంతోషంగా ఉంటాను. ఇదేదో కావాలని తీసుకున్న నిర్ణయమైతే కాదు' అని రామ్ చెప్పుకొచ్చాడు. రామ్ మాటల బట్టి చూస్తుంటే జీవితాంతం సింగిల్‌గానే ఉండిపోతాడేమో అనిపిస్తుంది. ఇతడి గత సినిమా 'ఆంధ్ర కింగ్ తాలుకా' టైంలో హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేతో డేటింగ్ రూమర్స్ వచ్చాయి. ఇప్పుడు రామ్ మాటల బట్టి చూస్తుంటే అవన్నీ ప్రమోషన్స్ కోసం సృష్టించినట్లే అనిపిస్తున్నాయి. ఇకపోతే ఇండస్ట్రీలో వందలాది మందితో పనిచేయడం గురించి మాట్లాడుతూ.. అది తప్పదని చెబుతూనే, అందరి మధ్య కూడా తనకంటూ ఓ ప్రత్యేక ప్రపంచాన్ని నిర్మించుకున్నానని చెప్పుకొచ్చాడు. లాక్‌డౌన్‌లో ఏడాదిన్నర పాటు ఒంటరిగానే బతికానని గుర్తుచేసుకున్నాడు.

# బిజినెస్

## ఈ ఆర్థిక సంవత్సరంలో 25,000 మంది ఫ్రెషర్ల నియామకం




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో 25,000 మంది ఫ్రెషర్లను నియమించుకోబోతున్నట్లు ప్రముఖ ఐటీ సేవల సంస్థ టీసీఎస్ ఎండీ, సీఈఓ కె.కృతివాసన్ వెల్లడించారు. గిరాకీ ఆధారంగా మరింత మందిని నియమించుకుంటామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో టీసీఎస్ 44,000 మంది ఫ్రెషర్లకు అవకాశం కల్పించింది. ప్రైవేటు రంగంలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగులను నియమించుకున్న సంస్థగా నిలిచింది. ఇతర కంపెనీల నుంచి ఉద్యోగులను నియమించుకునే విషయంలో కంపెనీ ఏమైనా మార్పులు చేసిందా? అని కృతివాసన్‌ను ప్రశ్నించగా.. సాధారణంగా ఒక ఫ్రెషర్‌కి శిక్షణ ఇచ్చి అతడు పూర్తి స్థాయి ఉద్యోగిగా మారడానికి 9 నెలల సమయం పడుతుందన్నారు. ఇతర కంపెనీ ఉద్యోగి అయితే వెంటనే అందుబాటులోకి వస్తారన్నారు. వ్యాపార అవసరాల ఆధారంగా నియామక వ్యూహాలు మారుతూ ఉంటాయని పేర్కొన్నారు. గడిచిన మూడేళ్లలో కనీసం 40,000 లేదా అంతకంటే ఎక్కువ మంది ఫ్రెషర్లను కంపెనీ నియమించుకుంటూ వచ్చిందని పేర్కొన్నారు. 2025-26లో 12,000 మంది ఉద్యోగులను టీసీఎస్ తొలగించింది. కంపెనీలో మెరుగైన పని తీరు కనబరిచినంత వరకు కెరీర్‌కు ఇబ్బంది ఉండదని కృతివాసన్ భరోసా ఇచ్చారు. గత ఏడాది కోతలకు, కృత్రిమ మేధ (ఏఐ) కారణమన్న వాదనలను తోసిపుచ్చారు. తొలగించిన ఉద్యోగుల్లో చాలా మంది సీనియర్ లెవల్‌కు చెందిన వారని తెలిపారు.

## 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా పెంపు




పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన అంతరాయాల మధ్య ఇంధన లభ్యతను నిర్వహించే క్రమంలో మన దేశంలో 5 కిలోల చిన్న ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరాను పెంచారు. అలాగే పైప్డ్ సహజ వాయువు (పీఎన్‌జీ) కనెక్షన్లను కూడా పెంచారు. మార్చి 23 నుంచి 13 లక్షలకు పైగా 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్లను విక్రయించారు. ప్రస్తుతం రోజువారీ విక్రయాలు లక్ష యూనిట్లను అధిగమించాయి. వలస కార్మికులు, తక్కువ ఆదాయ వినియోగదార్లు ఎక్కువగా వీటిని కొనుగోలు చేస్తున్నారు. మార్చి నుంచి 4,24,000 కొత్త పీఎన్‌జీ కనెక్షన్లను యాక్టివేట్ చేశారు. పరివర్తనలో భాగంగా 30,000 మందికి పైగా వినియోగదార్లు ఎల్‌పీజీ కనెక్షన్లను సరెండర్ చేశారు. ఎల్‌పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం: పశ్చిమాసియాలో యుద్ధం మొదలై ఆరు వారాలు కావడంతో అంతర్జాతీయంగా ఇంధన సరఫరాలో అంతరాయాలు నెలకొన్నాయి. మన దేశం సగానికి పైగా ముడి చమురును, 40 శాతం గ్యాస్‌ను, 85-90 శాతం ఎల్‌పీజీని ఈ ప్రాంతం నుంచే దిగుమతి చేసుకుంటుంది. ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలతో దిగుమతులపై ప్రభావం పడింది. దీంతో దేశ అవసరాల కోసం ఇతర ప్రాంతాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నా, ఎల్‌పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం ఉంది. దీంతో ప్రభుత్వం హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య వినియోగదార్లకు సరఫరాలో కోతలు విధిస్తూ, గృహ వినియోగదార్లకు ఎల్‌పీజీ సరఫరాలో ప్రాధాన్యత ఇచ్చింది. వంట గ్యాస్ ఎల్‌పీజీ కనెక్షన్లు లేని వారి కొరతను భర్తీ చేయడానికి మార్కెట్ ధరకు లభించే 5 కిలోల సిలిండర్ల సరఫరాను పెంచింది. సంక్షోభానికి ముందు ఫిబ్రవరిలో సుమారు 77,000 అయిదు కిలోల సిలిండర్ల అమ్మకాలు జరగ్గా, గత 2-3 వారాలుగా రోజువారీ అమ్మకాలు లక్ష దాటాయి. గృహ ఎల్‌పీజీ సరఫరాలు మొత్తంగా స్థిరంగా ఉన్నాయని, ఏప్రిల్ 11న 52 లక్షలకు పైగా సిలిండర్లను సరఫరా చేసినట్లు తెలుస్తోంది.

# చైనాపై 50% అదనపు సుంకాలు విధిస్తాం



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి చైనాపై బెదిరింపులకు దిగారు. ఇరాన్ నుంచి చమురు కొనుగోలు కొనసాగిస్తే చైనాపై 50% వరకు అదనపు సుంకాలు విధిస్తామని ఆయన ప్రకటించారు. ఈ చర్య ద్వారా ఇరాన్ ఆర్థిక వనరులను అడ్డుకోవడం, చైనా వాణిజ్య ఆధిపత్యాన్ని నిరోధించడం అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది. అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ చైనా ఇరాన్ నుంచి చమురును ప్రధానంగా కొనుగోలు చేస్తోంది. ఇది ఇరాన్ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటానికి సహాయపడుతున్నందున ఈ హెచ్చరిక జారీ చేయబడింది. చైనా నుంచి వచ్చే ఉత్పత్తులపై అదనపు పన్నులు విధిస్తానని ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగితే, ఈ చర్యలను మరింత కఠినతరం చేస్తామని, 50% పన్ను విధిస్తామని ట్రంప్ అన్నారు. ఇరాన్‌తో చైనా చమురు వాణిజ్యాన్ని నిలిపివేసి, దానికి బదులుగా వెనిజులా నుంచి తక్కువ ధరకు ఇంధనాన్ని అందిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణను దుర్వినియోగం చేసి ఇరాన్ ఆయుధాలను నిల్వ చేసుకుంటోందని ట్రంప్ ఆరోపించారు. అమెరికా ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని చైనా రాయబార కార్యాలయం ఒక అధికారిక ప్రకటనలో స్పందించింది. తాము యుద్ధంలో ఏ పక్షానికీ ఆయుధాలు అందించడం లేదని కూడా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక శక్తుల మధ్య జరుగుతున్న ఈ పోరాటం ప్రపంచ మార్కెట్‌పై తీవ్ర పరిణామాలను కలిగిస్తుంది. సరఫరా గొలుసును ప్రభావితం చేయడంతో పాటు, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తుల ధరల పెరుగుదలకు కూడా దారితీయవచ్చు. ఇరాన్‌ను ఆర్థికంగా ఏకాకిని చేయాలన్న అమెరికా ప్రయత్నాలకు చైనా సహకారం ఒక అడ్డంకిగా ఉంది. ఈ పరిస్థితుల్లో, వాణిజ్య సుంకాలను పెంచడం ద్వారా ట్రంప్ చైనాపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ట్రంప్ చర్యలు కొత్త వాణిజ్య యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# తులం బంగారం ధర చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే



అంతర్జాతీయంగా రాజకీయ అనిశ్చితి నెలకొన్నప్పుడు ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య అణు చర్చలు విఫలం కావడం, హోర్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధించడం వంటి పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం భయాలను పెంచాయి. దీని ప్రభావంతో స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతుండగా, బంగారం ధరలు మాత్రం రికార్డు స్థాయిలకు చేరుతున్నాయి. నేడు భారతీయ మార్కెట్లో 24 క్యారెట్ల (మేలిమి) బంగారం ధర పది గ్రాములకు రూ.1,52,830 వద్ద పలుకుతోంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో బంగారం ధరలు ఒకే రకంగా ఉన్నాయి. ఇక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,830 కాగా, ఆభరణాల తయారీకి వాడే 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,090 కు చేరింది. అంటే దాదాపు లక్షన్నర రూపాయలకు దగ్గరగా పసిడి రేటు ఉండటంతో పెళ్లిళ్ల సీజన్లో ఉన్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెన్నైలో మాత్రం ధరలు వీటికంటే కాస్త ఎక్కువగా (రూ.1,53,810) ఉన్నాయి. బంగారంతో పోటీ పడుతూ వెండి కూడా భారీగానే పెరుగుతోంది. దేశీయ మార్కెట్లో నేడు కిలో వెండి ధర రూ.2,64,900 వద్ద ఉంది. అంటే గ్రాము వెండి ధర సుమారు రూ.264.90 పలుకుతోంది. పారిశ్రామికంగా వెండికి డిమాండ్ పెరగడం, ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో వెండి ధరలు కూడా వచ్చే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం బంగారం ధరలు గరిష్ట స్థాయిలో ఉన్నప్పటికీ, యుద్ధ మేఘాలు తొలగిపోకపోతే ఇవి ఇంకా పెరిగే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే దీర్ఘకాలిక పెట్టుబడిదారులు ధర తగ్గినప్పుడల్లా కొంచెం కొంచెం కొనుగోలు చేసే బై ఆన్ డిప్స్ పద్ధతిని పాటించాలని సూచిస్తున్నారు. అయితే స్థానిక డిమాండ్, రాష్ట్ర పన్నులు, మేకింగ్ ఛార్జీల బట్టి మీరు కొనే జువెలరీ షాపులో ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు.

# ఈ లెక్కన ఎస్ఆర్‌హెచ్‌కు మూడినట్లే!




ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్తాన్ రాయల్స్ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ భీకర ఫామ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. బరిలోకి దిగిందే మొదలు బాదుడే లక్ష్యంగా పెట్టుకున్న ఈ బుల్లోడు 266.66 స్ట్రైక్‌రేట్‌తో 200 పరుగులకు పైగా సాధించి ఆరెంజ్ క్యాప్ రేసులో కొనసాగుతున్నాడు. తాను క్రీజులో ఉంటే బౌలర్ ఎవరైతే నాకేంటి.. బంతిపైనే తన దృష్టి ఉంటుందని ఇటీవలే ఆర్సీబీతో మ్యాచ్ అనంతరం డైరెక్ట్ స్టేట్‌మెంట్ విడుదల చేయడం గమనార్హం. ఇప్పటివరకు రాజస్తాన్ ఆడిన ప్రతీ జట్టులో ఒక ప్రధాన బౌలర్‌ను వైభవ్ ఒక ఆట ఆడుకున్నాడు. చెన్నైతో మ్యాచ్‌లో మాట్ హెన్రీని, గుజరాత్‌తో మ్యాచ్‌లో రబాడను, ముంబైతో మ్యాచ్‌లో బుమ్రాను, ఆర్సీబీతో మ్యాచ్‌లో హాజిల్‌వుడ్‌ను లక్ష్యంగా చేసుకొని ఫోర్లు, సిక్సర్లు బాదాడు. ఇక ఇవాళ వైభవ్ సూర్యవంశీ ఎస్ఆర్‌హెచ్‌ను వారి సొంతగడ్డపైనే ఎదుర్కోనున్నాడు. బుమ్రా, హాజిల్‌వుడ్, రబాడ వంటి టాప్ బౌలర్లను ఉతికారేసిన వైభవ్ ముందు ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ చిన్నబోతోంది. కమిన్స్ లేకపోవడంతో ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ బలహీనంగా తయారయ్యింది. ఒక్కరు కూడా చెప్పుకోదగ్గ బౌలర్ లేకపోవడం మైనస్‌గా మారింది. ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఎస్ఆర్‌హెచ్ బౌలర్లు దారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. యావరేజ్‌గా చూసుకుంటే ప్రతీ ఓవర్‌కు 10.42 పరుగులివ్వడం గమనార్హం. ఐపీఎల్ 2026 సీజన్‌లో బౌలింగ్ పరంగా అత్యంత చెత్త ప్రదర్శన ఎస్ఆర్‌హెచ్‌దే. ఇక పేసర్ల పరిస్థితి అగమ్యగోచరంగా కనిపిస్తోంది. హర్షల్ పటేల్, ఉనాద్కట్, ఇషాన్ మలింగలతో కూడిన పేస్ త్రయం ప్రతీ ఓవర్‌కు సగటున 11.47 పరుగులు సమర్పించుకున్నారు. ఈ లెక్కన ఇవాళ్టి మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ మరోమారు చెలరేగితే మాత్రం ఎస్ఆర్‌హెచ్ బౌలర్లకు మూడినట్లేనని క్రికెట్ అభిమానులు భావిస్తున్నారు. మొత్తంగా చూసుకుంటే రాజస్తాన్ రాయల్స్‌తో మ్యాచ్ అంటేనే ప్రత్యర్థి జట్ల బౌలర్లు హడలెత్తిపోయేలా చేస్తున్నాడు 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. ఇక ఐపీఎల్‌లో ఇరుజట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ల్లో ఎస్ఆర్‌హెచ్‌దే పైచేయిగా ఉంది. ఇప్పటివరకు ఇరుజట్లు 21 సార్లు తలపడితే ఎస్ఆర్‌హెచ్ 12 సార్లు, రాజస్తాన్ 9 సార్లు విజయాలు అందుకున్నాయి. సీజన్‌లో ఇప్పటికే వరుసగా నాలుగు విజయాలతో జోరు మీదున్న రాజస్తాన్ ఐదో విజయంపై కన్నేసింది. మరోవైపు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఒకే విజయం సాధించిన ఎస్ఆర్‌హెచ్ సొంతగడ్డపై రెండో విజయాన్ని అందుకోవాలని చూస్తోంది.

## మహిళల టీ20 వరల్డ్‌కప్.. 82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించిన ఐసీసీ



దుబాయ్: ఈ ఏడాది జూన్‌లో మహిళల టీ20 వరల్డ్‌కప్ జరగనున్నది. దీని కోసం ఇవాళ ఐసీసీ ప్రైజ్‌మనీ ప్రకటించింది. వరల్డ్‌కప్‌లో విజేతలకు అందజేసే ప్రైజ్‌మనీని రికార్డు స్థాయిలో పెంచేసింది. రెండు నెలల పాటు ఇంగ్లండ్, వేల్స్‌లో జరిగే వరల్డ్‌కప్ కోసం సుమారు 82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది ఐసీసీ. గత ఎడిషన్‌తో పోలిస్తే సుమారు 10 శాతం ప్రైజ్‌మనీ పెంచారు. ఈసారి ఈ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొననున్నాయి. 2024లో కేవలం 10 జట్లు మాత్రమే పాల్గొన్నాయి. జూన్ 12 నుంచి జూలై 5వ తేదీ వరకు ఏడు వేదికల్లో టోర్నీ జరగనున్నది. లార్డ్స్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ ఆడుతారు. గత వరల్డ్‌కప్‌లో ప్రైజ్‌మనీ 74 కోట్లు కాగా, ఈసారి 82 కోట్లు ఇవ్వనున్నారు. వరల్డ్‌కప్ విజేతలు ఈసారి 21.8 కోట్ల ప్రైజ్‌మనీ గెలుచుకుంటారు. ఇక రన్నరప్‌కు 10 కోట్లు ఇవ్వనున్నారు. సెమీఫైనల్లోకి ఎంటరైన జట్లకు 6.29 కోట్లు ఇవ్వనున్నారు. ఇక గ్రూపు మ్యాచ్ ఆడిన ప్రతి జట్టుకు 29 లక్షలు ఇవ్వనున్నారు. ప్రతి జట్టుకు కనీసం రెండు కోట్లు దక్కే అవకాశాలు ఉన్నట్లు ఐసీసీ తన ప్రకటనలో పేర్కొన్నది. జూన్ 12వ తేదీన బర్మింగ్‌హామ్‌లో శ్రీలంక, ఇంగ్లండ్ మధ్య ఫస్ట్ మ్యాచ్ జరుగుతుంది. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇండియా, ఐర్లాండ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్థాన్ , స్కాట్‌ల్యాండ్, దక్షిణాఫ్రికా, వెస్ట్ ఇండీస్ కూడా టోర్నీలో ఉన్నాయి. 24 రోజుల్లో మొత్తం 33 మ్యాచ్‌లు ఆడనున్నారు.

# స్పోర్ట్స్

## డగౌట్‌లో సెల్‌ఫోన్.. రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్‌కు బీసీసీఐ నోటీసులు



గౌహతి: రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్ రోమి బిందర్ చిక్కుల్లో పడ్డారు. గత శుక్రవారం ఆర్సీబీతో మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఆయన డగౌట్‌లో సెల్‌ఫోన్‌తో కనిపించారు. ఈ ఘటన పట్ల బీసీసీఐ సీరియస్‌గా ఉంది. రోమి బిందర్‌కు ఇవాళ బీసీసీఐ నోటీసులు జారీ చేసింది. ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడినట్లు బిందర్‌పై ఆరోపణలు వస్తున్నాయి. టీమ్ డగౌట్‌లో ప్లేయర్లు ఉండే ప్రదేశంలో మేనేజర్ రోమి బిందర్ సెల్‌ఫోన్ చూస్తున్నట్లు దృశ్యాలు రిలీజ్ అయ్యాయి. పక్కనే కూర్చుకున్న వైభవ్ సూర్యవంశీ .. అతని ఫోన్‌ను తీక్షణంగా చూస్తున్నట్లు ఆ వీడియోలో ఉన్నది. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ కావడంతో వివాదం ముదిరింది. దీనిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఐపీఎల్ చైర్మెన్ లలిత్ మోదీ కూడా డిమాండ్ చేశారు. బీసీసీఐకి చెందిన యాంటీ కరప్షన్ అండ్ సెక్యూర్టీ యూనిట్(ఏసీఎస్‌యూ) రోమి బిందర్‌కు నోటీసులు జారీ చేసింది. దర్యాప్తులో భాగంగా ఈ చర్యకు పాల్పడింది. అయితే 48 గంటల్లో ఆయన తన వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. దేని కోసం రోమి బిందర్ డగౌట్ ఏరియాలో ఫోన్ పట్టుకున్నారో తన వివరణలో చెప్పాల్సి ఉంటుంది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టాలని ఏసీఎస్‌యూ విభాగాన్ని ఆదేశించామని, దీనిపై నివేదికను ఇవ్వాలని కోరినట్లు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మెన్ అరుణ్ ధుమాల్ ఓ మీడియాతో తెలిపారు. అయితే ఆరోగ్య కారణాల కోసం బిందర్ ఫోన్ వాడి ఉంటారని భావిసత్‌ఉన్నారు. గతంలో ఆర్ఆర్ టీమ్ మేనేజర్‌కు ఆరోగ్య సమస్యలు ఎదరయ్యాయి. నాగపూర్‌లో ఓసారి ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించారు. మెడికల్ కారణాల చేత ఆయన తన ఫోన్‌కు డగౌట్‌కు తీసుకెళ్లే వీలు ఉంది, కానీ అక్కడ కూర్చుని ఫోన్‌ను వాడరాదు అని నియమావళి ఉన్నట్లు తెలుస్తోంది. రోమి ఇటీవల 10 కిలోల బరువు తగ్గినట్లు కొన్ని రిపోర్టుల ద్వారా తెలిసింది.

AKSHARA SAAVAL PRINTED PUBLISHED EDITED AND OWNED BY BADAVATH BALAJI PRINTED AT H.NO.-1-9-1296/5/B/A/1, NEW SHAYAMPET, KAZIPET MANDAL, HANUMAKONDA, TELANGANA-506001,EDITOR B.BALAJI CELL:8096677136 H.NO.-45/12/151, INDIRA NAGAR, MANDAL GEESUGONDA, WARANGAL TELANGANA-506013_ **RNI :**TEL TEL / 2023/ 84132